వైసీపీకి ఈసీ షాక్

తిరుపతి, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వంద శాతం వెబ్ కాస్టింగ్‌కు ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం వైసీపీ వర్గాలకు షాక్ ఇచ్చింది.అదే సమయంలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు, శ్రేణులకు మాత్రం భారీ ఊరట కల్గించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో 13వ తేదీన జరిగే పోలింగ్ సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద టాప్ ప్రయారిటీతో కేంద్ర బలగాలను నియమించనున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అక్రమాలు, శాంతిభద్రతల సమస్యలూ తలెత్తకుండా కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం మేరకు సంబంధిత ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఈసీ ఆదేశాలతో చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





- తిరుపతి, చంద్రగిరిల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్
- గత చరిత్ర, పరిశీలకుల సిఫార్సుతో ఈసీ నిర్ణయం
- పారదర్శకంగా పోలింగ్ జరిగేందుకు అవకాశం

వెబ్ కాస్టింగ్ అంటే....

రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకులు తమ కార్యాలయాల నుంచే ఎక్కడో వున్న పోలింగ్ కేంద్రాల్లో జరిగే పోలింగ్ ప్రక్రియ మొత్తాన్నీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరిశీలించే అవకాశం వెబ్ కాస్టింగ్ ద్వారా కలుగుతుంది. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటు వేయడానికి వచ్చే ఓటర్లను వెబ్ కెమెరా ద్వారా అధికారులు తమ కార్యాలయాల నుంచే చూడగలుగుతారు.ఓటర్ల రాకపోకల సరళిని తెలుసుకోగలుగుతారు. బూత్ కాప్చరింగ్, నగదు పంపిణీ, బోగస్ ఓటింగ్ వంటివి జరిగితే గుర్తించే వీలుంటుంది. రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారి, పరిశీలకులు వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరిగే పోలింగ్ ప్రక్రియను లైవ్‌లో చూడగలిగే అవకాశమున్నందున అటు పోలింగ్ అధికారులు, సిబ్బంది, ఇటు ఆ ప్రాంతంలో ప్రాబల్యమున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఎలాంటి తప్పిదాలకూ పాల్పడకుండా అప్రమత్తంగా వ్యవహరించడానికి దోహదపడుతుంది. ఒకవేళ తప్పిదాలకు పాల్పడినా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకునే వీలుంటుంది.

ఈసీ ఆదేశించక మునుపే....

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయకమునుపే జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు చేసింది. జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 2140 వుండగా అందులో 696 కేంద్రాలు సమస్యాత్మకమైనవని జిల్లా యంత్రాంగం గుర్తించింది. అంతకంటే ఎక్కువగానే 1237 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ప్రతిపాదించింది. 890 మంది వీడియోగ్రాఫర్లు కూడా అవసరమని గుర్తించింది. చంద్రగిరి నియోజకవర్గంలో 397 పోలింగ్ కేంద్రాలుంటే అందులో 202 సమస్యాత్మకంగానూ, మరో 15 అత్యంత సమస్యాత్మకంగానూ వున్నాయి. అయితే 330 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు యంత్రాంగం మునుపే ప్రతిపాదించింది. ఈ నియోజకవర్గంలో 220 మంది వీడియోగ్రాఫర్ల అవసరముందని గుర్తించింది. అలాగే తిరుపతి నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలుంటే అందులో 86 సమస్యాత్మకం. ఈ సెగ్మెంట్‌లో కూడా 177 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ అవసరమని జిల్లా యంత్రాంగం ప్రతిపాదించింది. 110 మంది వీడియోగ్రాఫర్లను ఏర్పాటు చేయాల్సి వుందని కూడా ప్రతిపాదనలు పంపించింది.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు ఇలా...

పోలింగ్ కేంద్రాల నుంచీ పర్యవేక్షక అధికారులకు లైవ్ బ్రాడ్‌కాస్టింగ్ జరపడమే వెబ్ కాస్టింగ్ పనిగా వుంటుంది. పోలింగ్ కేంద్రాల్లో మూడు రకాలుగా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయవచ్చు. ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ పర్సనల్ కంప్యూటర్‌ను వెబ్ కెమెరా, ఇంటర్నెట్‌లతో వినియోగించవచ్చు. అలాగే సీసీటీవీ హైబ్రిడ్ సెటప్ మరియు ల్యాప్‌టాప్ లేదా పర్సనల్ కంప్యూటర్ ద్వారా అయినా వెబ్ కాస్టింగ్ చేయవచ్చు. మరో విధంగా ల్యాప్‌టాప్ లేదా పర్సనల్ కంప్యూటర్‌ను ఇంటర్నెట్ సదుపాయం కలిగిన మొబైల్ ఫోన్‌తో కనెక్ట్ చేసి వాడచ్చు. కాగా పోలింగ్ కేంద్రంలో ఇంటర్నెట్ సదుపాయం లేకుంటే యూఎస్‌బీ మోడెమ్ గానీ లేదా మొబైల్ ఇంటర్నెట్ గానీ వాడడానికి వీలుంటుంది.

వంద శాతం వెబ్ కాస్టింగ్‌కు కారణాలివే!

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్‌కు ఈ రెండు నియోజకవర్గాలలో నెలకొన్న అరాచక పరిస్థితులే కారణమయ్యాయి. చంద్రగిరి విషయానికొస్తే 50 శాతం పోలింగ్ కేంద్రాలు ఇప్పటికే సమస్యాత్మకంగా వున్నాయి. మరో 15 కేంద్రాలు తీవ్ర సమస్యాత్మకం. ఈ 15 కేంద్రాల్లో గత ఎన్నికల్లో ఘర్షణలు, రీ పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ కారణంగా ఈసీ నిర్ణయానికి మునుపే జిల్లా యంత్రాంగం మొత్తం 397 కేంద్రాలకు గానూ 85 శాతం అంటే 330 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ప్రతిపాదించింది. మరోవైపు అధికార పార్టీ నేతలు ఓటర్ల జాబితా తయారీ దశ నుంచీ అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు పెద్దఎత్తున ఆధారాలతో ఈసీకి ఫిర్యాదులు చేశారు. కింది స్థాయి ఉద్యోగుల నుంచీ డివిజన్ స్థాయి అధికారుల వరకూ అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని కూడా ఫిర్యాదులు చేశారు. ఇక తిరుపతి విషయానికొస్తే ఎంపీ ఉప ఎన్నికల్లో 36 వేల ఎపిక్ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేయడం, వాటికి డూప్లికేట్ కార్డులు తయారు చేయడం, భారీ ఎత్తున దొంగ ఓటర్లను రంగంలోకి దించి వారితో ఓట్లు వేయించడం తెలిసిందే. అధికార పార్టీ నేతలు రూపొందించిన ఈ ప్రణాళికలో కంప్యూటర్ ఆపరేటర్లు మొదలుకుని, డీటీ, తహసిల్దారు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, చివరికి అప్పట్లో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన కలెక్టర్ స్థాయి అధికారి వరకూ సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. దొంగ ఓటర్ల విషయంలో నమోదైన కేసుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు పోలీసు అధికారులు కూడా సస్పెండయ్యారు. ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్, డూప్లికేట్ ఓటరు కార్డుల తయారీకి సంబంధించి పలు కేసులు కూడా నమోదయ్యాయి. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తిరుపతి కేంద్రంగా పలు అక్రమాలు జరిగిన సంగతి తెలిసిందే. తాజా ఎన్నికల్లో కూడా అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష నేతలు, అభ్యర్థులు ఈసీకి ఫిర్యాదు చేశారు. మరోవైపు జిల్లాలో ఇటీవల పర్యటించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు కూడా ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఈసీ చంద్రగిరి, తిరుపతిలలో వంద శాతం వెబ్‌కాస్టింగ్‌కు ఆదేశాలిచ్చింది.

ఈసీ ఆదేశాలతో మారుతున్న సమీకరణలు


తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఈసీ ఆదేశాలతో వంద శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు, గరిష్ఠ స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలను మొహరించనుండడంతో ఆ మేరకు రాజకీయ సమీకరణలు కూడా మారనున్నాయి. ఈసీ ఆదేశాలు అధికార పార్టీ నేతలకు మింగుడు పడడం లేదు. పోలింగ్ కేంద్రాల వద్ద కండబలంతో పైచేయి సాధించడానికి, దొంగ ఓటర్లను రంగంలోకి దింపడానికి అవకాశాలుండవు. స్థానికంగా అధికార పార్టీ నాయకులు ఎవరో, కార్యకర్తలెవరో కేంద్ర బలగాలు గుర్తించే పరిస్థితి వుండదు. అధికార పార్టీ నేతల ఆదేశాలను ఖాతరు చేసే పరిస్థితి అంతకంటే వుండదు. దీనివల్ల పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలు నియంత్రణలో వుండే అవకాశముంది. వెబ్ కాస్టింగ్ వల్ల దొంగ ఓట్లు, రిగ్గింగ్ వంటివాటికి వీల్లేకుండా పోతోంది. ఈ పరిణామాలు వారికి ఏమాత్రం మింగుడుపడడం లేదు. అదే సమయంలో ఈసీ నిర్ణయంతో ప్రతిపక్షపార్టీల అభ్యర్థులు, శ్రేణులు ఊపిరి తీసుకుంటున్నాయి. ఇది వారికి పెద్ద ఊరటగా మారుతోంది. వీరి అభిప్రాయాలెలా వున్నా పారదర్శకంగా పోలింగ్ జరిగే పరిస్థితులు నెలకొనడం పట్ల సామాన్య జనంలో కూడా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గరిష్ఠంగా కేంద్ర బలగాలు

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను గుర్తించిన ఈసీ ఆ రెండు చోట్లా స్థానిక పోలీసు బలగాలతో పాటు కేంద్ర బలగాలను నియమించాలని ఆదేశించింది. అది కూడా పోలింగ్ రోజున కేంద్ర బలగాలను గరిష్ఠస్థాయిలో ఈ రెండు చోట్లా వినియోగించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే జిల్లాలో సివిల్ పోలీసులు, హోమ్ గార్డులకు అదనంగా బీఎస్ఎఫ్ మూడు కంపెనీలు (240 మంది), సీఆర్‌పీఎఫ్ మూడు కంపెనీలు (అండమాన్ నుంచీ వచ్చిన 225 మంది), సీఐఎస్ఎఫ్ మూడు కంపెనీలు (230 మంది) చొప్పున మొత్తం 695 మందితో కూడిన కేంద్ర బలగాలు విధుల్లో వున్నాయి. తాజాగా ఈసీ ఆదేశాలతో మరిన్ని కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు వచ్చే అవకాశముంది.

రెక్కలు రాలుతున్న ఫ్యాను

- ఎన్నికలకు ముందు నగరి వైసీపీకి కోలుకోలేని దెబ్బ
- పార్టీకి రాజీనామా చేసిన శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ తదితరులు
- త్వరలోనే టీడీపీ తీర్థం పుచ్చుకునే అవకాశం?



పుత్తూరు అర్బన్, మే 3: ఎన్నికలకు ముందు నగరి వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. కీలక నాయకులు వరుసపెట్టి పార్టీని వీడుతుండడంతో వైసీపీ పునాదులు కదులుతున్నాయి. ఇటీవల పుత్తూరుకు చెందిన మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై మొదలియార్ వైసీపీకి రాంరాం చెప్పి చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం రాత్రి వడమాలపేటకు చెందిన జడ్పీటీసీ మురళీధర రెడ్డిని పట్టుబట్టి మరీ వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజా పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సంచలనం కలిగించే పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి అన్న కుమారుడు శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, విజయపురానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి రాజు,జడ్పీటీసీ మురళీధర రెడ్డి, నిండ్ర మండలానికి చెందిన కొప్పేడు ఎంపీటీసీ రెడ్డివారి భాస్కరరెడ్డి, చవరం బాకం ఎంపీటీసీ టి.విజయ, శ్రీరామాపురం సర్పంచ్ జయమ్మ,ఈఎన్ కండ్రిగ సర్పంచ్ జయచంద్రారెడ్డి, కైపాకం సర్పంచ్ ఏజే ప్రభాకర్, కొప్పేడు సర్పంచ్ సంపూర్ణమ్మ వైసీపీకి గుడ్‌బై చెప్పారు.ఈ నెల 5వ తేదీన తామంతా టీడీపీలో చేరుతున్నట్టు తిరుపతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు.పైగా వడమాల పేట టోల్ గేట్ వద్ద స్థలాలను రోజా కబ్జా చేయడాన్ని ప్రశ్నించినందుకే తమపై ఆమె కక్ష కట్టారని, సీఎం రిలీఫ్ ఫండ్‌లోనూ బాధితుల నుంచీ రోజా కమీషన్ల రూపంలో దండుకున్నారని ఆరోపించారు. రోజా చేసిన అవినీతి అక్రమాలపై కాణిపాక వినాయకుడి సన్నిధిలో తాము ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. చంద్రముఖిలా మారిన రోజాను నగరి నుంచీ ఓటు అనే ఆయుధంతో తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.దీంతో నగరి నియోజకవర్గంలో వైసీపీకి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయనే అభిప్రాయాలు పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నాయి.



వైసీపీకి రాజీనామా చేసినట్లు చూపుతున్న పత్రాలతో వైసీపీ నేతలు

భాను వ్యూహం ముందు రోజా చిత్తు

నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ వ్యూహం ముందు మంత్రి రోజా విలవిల్లాడుతున్నట్టవుతోంది.అసమ్మతి నాయకులను టీడీపీ వైపు ఆకర్షించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తూ వైసీపీని చావు దెబ్బ కొట్టారనే ప్రచారం నియోజకవర్గవ్యాప్తంగా సాగుతోంది.

రోజా వ్యవహారశైలితోనే

ఐదేళ్ల నుంచి మంత్రి రోజా వ్యవహారశైలితో విసుగు చెందిన నాయకులు కీలకమైన ఎన్నికలకు ముందు ఒక్కొక్కరుగా బయటకు వెళుతుండడం అధికార పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఐదు మండలాలకు చెందిన కీలక నాయకులు మూడు మాసాల నుంచి రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ అధిష్ఠానానికి పలుమార్లు మొరపెట్టుకున్నారు.అయితే వీరి అభిప్రాయాలను తోసిపుచ్చిన వైసీపీ పెద్దలు తిరిగి రోజాకే నగరి టికెట్ ఇవ్వడంతో జీర్ణించుకోలేకపోయారు. దీనికి తోడు వైసీపీ అధిష్ఠానం కూడా అసమ్మతి నాయకులతో సయోధ్య కుదుర్చుకునేందుకు రోజాను ఒప్పించడంలో ఘోరంగా విఫలమైంది. రోజా కుటుంబ దౌర్జన్యాలు ,అవినీతి, బెదిరింపుల నుంచి నియోజకవర్గ ప్రజలను కాపాడుకోవాలనే లక్ష్యంతోనే వైసీపీని వీడుతున్నట్లు శుక్రవారం రాజీనామాలు చేసిన నాయకులు తిరుపతి మీడియా సమావేశంలో ప్రకటించడం విశేషం. తాము రోజా ఓటమికి కీలకం కానున్నామనే పరోక్ష సంకేతాలను వారు స్పష్టంగా ఇచ్చారు.

మాకేం మేలు చేశారని వచ్చారు?

మంత్రి రోజా ప్రచారాన్ని అడ్డుకున్న వేమాపురంవాసులు





వైసీపీ నేతలను అడ్డుకుంటున్న వేమాపురంవాసులు - ఇళ్ల తలుపులు మూసుకుని గ్రామస్తుల నిరసన

వడమాలపేట, మే 3 : వైసీపీ ప్రచారాన్ని గ్రామస్తులంతా కలసి అడ్డుకున్న సంఘటన శుక్రవారం రాత్రి వడమాలపేట మండల పరిధిలో జరిగింది.పూడి పంచాయతీ వేమాపురం గ్రామానికి ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ అభ్యర్థి రోజా వస్తున్నారని తెలపడానికి ముందుగా ప్రచార రథం వచ్చింది.అయితే తమ గ్రామానికి ఆమె ఏమి మేలు చేసిందని ప్రచారానికొస్తుందని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రచారరథాన్ని గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఈ విషయం తెలిసి పక్క గ్రామంలో ఉన్న రోజా వేమాపురంలో ప్రచారం నిర్వహించేందుకు పోలీసులు సహాయం తీసుకున్నట్లు సమాచారం. అప్పటికీ గ్రామస్తులు శాంతించకపోవడంతో ప్రచారరథం వెనుదిరిగింది.ఇంత జరిగినా రోజా శుక్రవారం 9.30గంటలకు వేమాపురంలోకి అడుగు పెట్టింది. పోలీసుల సహాయంతో ప్రచార రథం పైకెక్కి ఓట్లను అభ్యర్థించే ప్రయత్నం చేసింది.అయితే అప్పటికే గ్రామస్తులు ఇళ్లలోకి వెళ్లిపోయి తలుపులు మూసేసి నిరసన తెలిపారు.దీంతో రోజా వెనుదిరిగారు.

భారీగా మద్యం పట్టివేత

- వైసీపీ నాయకులే నిల్వ చేస్తున్నారన్న టీడీపీ



ఇటుక బట్టీ గోడౌన్‌లో పట్టుబడిన మద్యం కేసులు

పాకాల, మే 3: పుదుచ్చేరి నుంచి భారీగా మద్యాన్ని తీసుకొచ్చి ఇటుక బట్టీ గోడౌన్‌లో నిల్వ చేస్తుండగా సెబ్ అధికారులు పట్టుకున్నారు. మినీ లారీలో మద్యాన్ని తీసుకొచ్చి శుక్రవారం రాత్రి పాకాల మండలం పంటపల్లె సమీపంలోని ఇటుక బట్టీ వద్ద షెడ్‌లో నిల్వ చేస్తుండగా గమనించిన కొంతమంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. సెబ్ అధికారులతో కలిసి వాహనంతోపాటు మద్యం కేసులు స్వాధీనం చేసుకుని, కొందరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ మద్యం 200కేసులకుపైగా ఉండొచ్చని సమాచారం. సంఘటనా స్థలానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకుని మరిన్ని ప్రాంతాలకు మద్యాన్ని తరలించి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఉద్దేశంతోనే వైసీపీ నేతలు మద్యాన్ని భారీగా నిల్వ చేసుకుంటున్నారని ఆరోపించారు.

47డిగ్రీలు దాటిన ఎండలు

తిరుపతి కలెక్టరేట్, మే 3: జిల్లాలో ఎండలు మే మొదటి వారంలోనే రోహిణి కార్తెను తలపిస్తున్నాయి. ఎండ వేడిమికి వడగాడ్పులు తోడవడంతో ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. శుక్రవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. తొట్టంబేడులో 47.1, సూళ్లూరుపేటలో 46.4, రేణిగుంటలో 45.8, నాయుడుపేటలో 45.7, వెంకటగిరి, డక్కిలి, చిల్లకూరులో 44.7, ఓజిలి, కోట, గూడూరు, డీవీ సత్రం, చిన్నగొట్టిగల్లులో 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాకాడు, బాలాయపల్లి మండలాల్లో అత్యల్పంగా 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, మిగిలిన మండలాల్లో 40 డిగ్రీలను దాటేసింది.

వడదెబ్బతో ఇద్దరి మృతి

పిచ్చాటూరు/శ్రీకాళహస్తి, మే 3 : వడదెబ్బ తగిలి మరో ఇద్దరు వృద్ధురాళ్లు ప్రాణాలొదిలారు.పిచ్చాటూరు మండలం పాత గొల్లకండ్రిగకు చెందిన ఆరింబాకం సరోజమ్మ(105) శుక్రవారం కాసిన ఎండకు తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయారు. ప్రథమ చికిత్స కోసం తరలిస్తుండగా తుది శ్వాస విడిచారు. తొమ్మిది మంది కుమార్తెలు, ఒక కుమారుడున్న సరోజమ్మ ఇన్నాళ్లూ తన పనులు తానే చేసుకుంటూ వుండడం విశేషం. అలాగే శ్రీకాళహస్తి పట్టణంలోని ధర్మరాజుల స్వామి ఆలయం సమీపంలో గుర్తుతెలియని వృద్ధురాలు వడదెబ్బసోకి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఆమె శవాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బంధువులు సరైన ఆధారాలతో సంప్రదిస్తే మృతదేహాన్ని అప్పగిస్తామని తెలిపారు.

చంద్రగిరి

ఐతేపల్లెలో ఓ ఇంట్లో చోరీ...

టీవీ, వెండి సామగ్రి, నగదు అపహరణ





సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను చోరీ చేసిన దృశ్యం

మునీశ్వరి ఇంట్లో బీరువా పగలగొట్టిన దృశ్యం

చంద్రగిరి, మే 3: చంద్రగిరి మండలం, ఐతేపల్లెలో దొంగల భయంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. అదేవిధంగా వారం క్రితం ఏటీఎంలో చోరీకి ప్రయత్నించగా, విఫలమైంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ఐతేపల్లె గ్రామానికి చెందిన పాదిరి మునీశ్వరి గల్ఫ్‌లో ఉంటుంది. ఆమె తల్లి పాదిరి వళ్లెమ్మ ఒక్కటే ఇంటి వద్ద ఉంటుంది. ఆమె కాలూరులో ఉన్న తన కుమారుడు మురళీరెడ్డి ఇంటికి వెళ్లగా, గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు మునీశ్వరి ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువా, డ్రాయర్లు, కబోర్డులు పగలగొట్టి ఇంట్లో వస్తువులను చిందర వందర చేశారు. శుక్రవారం ఉదయం మురళీరెడ్డి, తల్లి వళ్లెమ్మలు ఐతేపల్లె ఇంటికి వెళ్లి చూడగా, ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. దీంతో తమ ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, వేలి ముద్ర నిపుణులు అక్కడికి చేరుకుని వేలి ముద్రలు సేకరించి, చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఇంట్లో ఉన్న టీవీ, వెండి దీపాలు, సామగ్రి, రూ.8వేల నగదు, సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌లను చోరీ చేశారు. దుండగుల ఆధారాలు కనిపించకుండా ఇంట్లో నీళ్లు పోశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా వారం క్రితం ఐతేపల్లె కూడలిలో ఉన్న ఏటీఎంలో చోరీ చేయడానికి దుండగులు ప్రయత్నించగా, విఫలం కావడంతో ఏటీఎం మెషన్‌కు ఉన్న వైర్లు కత్తిరించి వెళ్లిపోయారు. ఐతేపల్లెలో చోరీలు జరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు మరింత గస్తీ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు, ఎల్లుండి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

చంద్రగిరి ఆర్వో నిషాంత్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 3: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రేపు, ఎల్లుండి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించనున్నట్లు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారి రిషాంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి మహిళా వర్సిటీలోని హ్యూమానిటీ బ్లాక్-1లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు 25 చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కలిగినవారు మహిళా వర్సిటీలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓట్లు వేయాల్సి ఉంటుంది. రెండు రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన ఉప్పరపల్లె పంచాయతీ వైసీపీ నేతలు

తిరుచానూరు, పాకాల, మే 3: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఉప్పరపల్లె పంచాయతీ దళితవాడకు చెందిన పలువురు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పులివర్తి నాని వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే గాదంకి పంచాయతీ మిట్టగాదంకికి చెందిన వైసీపీ నేతలు బాబు, సుధాకర్, శేఖర్ తిరుపతి రూరల్ మండలంలోని రఘునాథ్ రిసార్ట్స్‌లో నాని సమక్షంలో పార్టీలో చేరారు.

పేరూరులో డాలర్స్ దివాకర్‌రెడ్డి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, మే 3: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని తరపున శుక్రవారం పేరూరు, పైడిపల్లి పంచాయతీల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే లక్ష్యం సుసాధ్యం

విశ్రాంత ఐఏఎస్ రత్నప్రభ



కలెక్టరమ్మ పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, మే 3: పట్టుదల ఉంటే ఎంతటి కష్టతర లక్ష్యమైనా సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని విశ్రాంత ఐఏఎస్ అధికారి రత్నప్రభ అన్నారు. నారాయణ ఐఏఎస్ అకాడమి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ప్రసంగిస్తూ ఆధునిక సమాజంలో శిక్షణ కేంద్రాల్లో సమగ్ర మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో ఇలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది అకుంఠిత దీక్షతో ఐఏఎస్ సాధించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురి సందేహాలను నివృత్తిచేసి సివిల్స్ లక్ష్యాలను సాధించేందుకు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం తన స్వీయ రచనతో రూపొందించిన కలెక్టరమ్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఉన్నత సమాజ నిర్మాతలు సామాజిక శాస్త్ర విద్యార్థులే

ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ డేలో వీసీ శ్రీకాంత్‌రెడ్డి



కాలేజీ డేలో ప్రసంగిస్తున్న వీసీ

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 3: ఉన్నత సమాజ నిర్మాతలు సామాజిక శాస్త్ర విద్యార్థులేనని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీనివాసా ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ డేలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తమ అభిప్రాయంతో పాటు విద్యార్థులు తోటి వ్యక్తుల మనోభావాలను అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ పద్మనాభం మాట్లాడుతూ.. శ్రమ, నేర్పుతో విద్యార్థులు చదువుకోవాలన్నారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఫ్యాకల్టీ డీన్ మురళీధర్, ఈసీ సభ్యులు సుమకిరణ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్కాట్ మణి, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో

11 మందికి అపరాధ రుసుం విధింపు

- జీపు డ్రైవర్‌కు రెండ్రోజుల జైలు శిక్ష

- మరో డ్రైవర్‌కు 8 గంటల పాటు నిల్చొనే ఉండాలని ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), మే 3: తిరుపతిలో అతిగా మద్యం సేవించి వాహనాలు వేగంగా నడిపి ట్రాఫిక్‌కు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిన కేసుల్లో మొత్తం 11 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.1,10,00 జరిమానా విధించారు. వీరు కాకుండా మోతాదుకు మించి మద్యం సేవించి ప్రమాదాలకు కారకులుగా మారిన మామండూరుకు చెందిన షేక్ ఖాదర్‌బాషాకు తిరుపతి మొదటి తరగతి నాల్గవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే నెల్లూరు జిల్లా మంగళాపూర్‌కు చెందిన డ్రైవర్‌కు ఉదయం కోర్టు సమయం నుంచి సాయంత్రం వరకు కోర్టు హాలులో నిలబడి ఉండాలని న్యాయమూర్తి శిక్ష విధించారు. వీరితో పాటు నడి రోడ్లపై తట్టలు, తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారం చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న 25మందికి ఒక్కొక్కరికి రూ.200 వంతున రూ.5,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మురుగు కాలువలో శిశువు మృతదేహం



మంగళం, మే 3: మంగళం క్వార్టర్స్ పంచాయతీలోని కృష్ణవేణి యాదవ్ కాలనీలోని ఓ మురుగు కాలువలో శిశువు మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. ఈ విషయం తెలియడంతో సమీప ప్రాంతాల ప్రజలంతా అక్కడికి చేరుకున్నారు. శిశువు మృతదేహాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శిశువు సమాచారం కోసం పరిసరాల్లో ఆరా తీసినా ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తిరుచానూరు ఎస్‌ఐ జగన్నాథరెడ్డి తెలిపారు.

పోలీసు కవాతు



రామచంద్రాపురం, మే 3: మండలంలోని శాఖమూరికండ్రిగ, బలిజపల్లి, కన్నీకాపురం గ్రామాల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భగా స్‌ఐ చిరంజీవి మాట్లాడుతూ ఎన్నికల రోజు పోలింగ్‌కు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కవాతులో 75 మంది పారామిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు తెలియకుండానే ఉపాధి బిల్లుల స్వాహా

దేవరకొండ పంచాయతీలో వైసీపీ నాయకుల అవినీతిపై విచారణ





ఉపాధి అవినీతిపై విచారణ జరుపుతున్న ఏపీడీ పద్మలత, తన పొలంలో పనులు చేయలేదని రైతు రాసిచ్చిన పత్రం

తిరుపతి, మే 3: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ దూదేవాండ్లపల్లెకు చెందిన శివకుమార్ తమ గ్రామంలో ఉపాధి హామి పథకం కింద పనులు జరగకుండానే బిల్లులు స్వాహా అవుతున్నాయని ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రగిరి క్లస్టర్ ఏపీడీ పద్మలత బృందం శుక్రవారం దేవరకొండ పంచాయతీలో జరిగిన ఉపాధి పనులపై విచారణ చేపట్టారు. రైతు కంచన విశ్వనాథం పొలంలో రూ.75 వేలతో పనులు జరిగినట్లు బిల్లులు డ్రా చేయబడిన పారంపాండ్‌ను చూపించాల్సిందిగా ఫీల్డ్ అసిస్టెంట్ సుజాతను ఏపీడీ ఆదేశించారు. దీంతో వారు పొలం వద్దకెళ్లి రైతు విశ్వనాథంను విచారించారు. ఈ సందర్భంగా రైతు విశ్వనాథం తనపొలంలో పారంఫాండ్‌ను తవ్వలేదని, తాను ఉపాధి పథకం కింద ఎటువంటి పనులు చేపట్టలేదని అధికారులకు రాతపూర్వకంగా తెలిపారు. విషయం తెలుసుకొన్న వైసీపీ నాయకులు అక్కడికి చేరుకొని రైతుని తమకు అనుకూలంగా రాసివ్వాలని ఒత్తిడి తెచ్చారు. అయినా రైతు ఒప్పుకోకుండా అవినీతి విషయాన్ని బయటపెట్టాడు. ఫిర్యాదుదారుడు పేర్కొన్న అంశాలన్నీ వాస్తవమేనని అధికారులు నిర్ధారించుకొని సాయంత్రం కావడంతో తిరిగి వెళ్లిపోయారు. పూర్తిస్థాయి విచారణ చేస్తే భారీ అవినీతి బయట పడనున్నదని ఫిర్యాదారుడు శివకుమార్ ఈ సందర్భంగా తెలిపారు. క్షేత్ర సహాయకురాలు పనులు చేయకుండానే ఉపాధి బిల్లులు వైసీపీ నాయకులకు దోచి పెడుతుందని గ్రామస్తులు ఆరోపించారు. ఉపాధి పనులు అమలులో ఫొటోలు, జీపీఎస్, కంప్యూటర్ అనుసంధానం ఉన్నా యథేచ్ఛగా పనులు జరపకనే బిల్లులు మంజూరై పోతుండటం గమనార్హం. ఏడాదిగా భారీగా పనులు చేయకనే బిల్లులు మంజూరై పోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీనిపై ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అదను చూసి ఆక్రమణ..!

- శ్మశానస్థలాన్నీ వదలని వైసీపీ నేతలు
- పేరూరులో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు



పేరూరు శ్మశానస్థలంలో తాజాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న దృశ్యాలు

తిరుపతి రూరల్, మే 3: తిరుపతి రూరల్ మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన శ్మశానస్థలంలో అదనుచూసి స్థానిక వైసీపీనేతలు ఆక్రమణలకు తెరలేపారు. తాజాగా ఎన్నికలకోడ్ అమలులో ఉండటంతో ఎవరూ పట్టించుకోరన్న ఉద్దేశ్యంతో గుట్టుచప్పుడు కాకుండా ఈ స్థలంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. గ్రామానికి చెందిన సర్వేనెంబరు 537లో 2.25ఎకరాల శ్మశానస్థలంపై కన్నేసిన స్థానిక వైసీపీ నాయకులు ఇప్పటికే పలు దఫాలుగా అక్రమ నిర్మాణాలు చేపట్టడం.. గ్రామస్తుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు కూలదోయడం వంటి ప్రక్రియ రొటీన్‌గా జరుగుతూనే ఉంది. రెండు నెలల క్రితం అధికారులు తొలగించిన స్థలంలోనే మళ్లీ ఇప్పుడు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ వర్గాలు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు శ్మశానస్థలానికి చుట్టూ హద్దుగా కాంపౌండ్‌వాల్ నిర్మించేందుకు మూడునెలల క్రితం తుడా రూ.25లక్షల నిధులను మంజూరు చేసింది. ఆక్రమణదారులు అడ్డుకుంటుండటంతో ఈ ప్రహరీ నిర్మాణ ప్రక్రియ అడుగు ముందుకు పడటం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈస్థలానికి హద్దుగా ప్రహరీ నిర్మాణం చేపట్టి ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీవారి ఆశీస్సులతో విజయం నాదే

- తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు





బీసీ సంఘ సమావేశంలో వెలగపల్లి వరప్రసాద రావు - ముస్లింలతో సమావేశమైన వరప్రసాద రావు



తిరుమల ఆలయం ముందు వెలగపల్లి వరప్రసాద రావు కుటుంబం

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 3: తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తిరుపతి ఎంపీగా మరోసారి తాను విజయం సాధించబోతున్నానని బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం తిరుమలతో శ్రీవారిని ఆయన కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి నగరంలోని పీకే లేఅవుట్‌లో బీసీ సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన పాలుపంచుకున్నారు. జీవకోనలో ముస్లిం సోదరులతో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తాను ఎప్పుడు అందు బాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, వరప్రసాద్ సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమారుడు నవీన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు



మృతి చెందిన మహేష్‌బాబు (ఫైల్‌ఫొటో)

రామచంద్రాపురం, మే 3: మండలంలోని తాటిమాకులకండ్రిగ గ్రామంలోని వ్యవసాయ బావి వద్ద శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహేష్‌బాబు వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ మోటరు మరమ్మతులకు గురైంది. నలుగురు వ్యక్తులతో కలిసి మరమ్మతుల నిమిత్తం బోరు నుంచి పైపులు లాగుతుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం చోటుచేసుకుంది. మహేష్‌బాబు(46) తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బాలకృష్ణారెడ్డి(35) తీవ్రంగా గాయపడగా, ఇంద్రసేనారెడ్డి, రఘునాథ్‌రెడ్డిలు స్వల్పగాయాలకు గురయ్యారు.


అమలు కాని ప్లాస్టిక్ నిషేధం



రోడ్డు పక్కన ఇబ్బడిముబ్బడిగా పడిఉన్న ప్లాస్టిక్ కవర్లు

తిరుపతి(ఆటోనగర్), మే 3: తిరుపతి పుణ్యక్షేత్రంలో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదు. దేశం నలుమూలల నుంచి నగరానికి రోజూ కొన్నివేల సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు. వీరికి ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు కార్పొరేషన్ అధికారులు ప్లాస్టిక్ కవర్లను నిషేధించారు. అయితే తిరుపతి, రేణిగుంట, తిరుచానూరు, చంద్రగిరి పట్టణాల్లోని అన్ని దుకాణాల్లో ప్లాస్టిక్‌కవర్ల అమ్మకాల వినియోగం పెరిగింది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సిరుల తల్లికి వేడుకగా వీధోత్సవం




తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, పాకాల, మే 3: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం అత్యంత వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ నిర్వహించి, మధ్యాహ్నం ఫ్రైడే గార్డెన్‌లో కన్నులపండువగా తిరుమంజనం జరిగింది. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు తెరలేపిన వైసీపీ!

తిరుపతి(నేరవిభాగం), మే 3: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని మంగళంలో వైసీపీ నాయకులు ప్రలోభాలకు తెరలేపారు. శుక్రవారం కూడా ఓటరు లిస్టు చేతపట్టుకున్న కొందరు యువకులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరుతూ ఇంటికి రూ.500 చొప్పున నగదు పంపిణీ చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(కపిలతీర్థం), మే 3: తిరుపతి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ చింతా మోహన్‌కు ఓటు వేసి గెలిపించాలని నగర పార్టీ అధ్యక్షులు యార్లపల్లి గోపీ కోరారు. స్థానిక గిరిపురం, పట్నంవీధి, కోలావీధి, చింతకాయలవీధిలో ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చింతా మోహన్ హయాంలో తిరుపతిలో జరిగిన అభివృద్ధి గురించి ఆయన ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ నేతలు భానుప్రకాష్, నాగరాజు, షేక్ జావేద్, శాంతి యాదవ్, మునిశోభ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే రజకులకు రక్షణ

- రజక సంఘం నేత మల్లెల నాగరాజు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 3: టీడీపీ పాలనలోనే రజకుల సంక్షేమం, రక్షణ ఉంటుందని రజక సంఘం నేత మల్లెల నాగరాజు పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో రజకులపై దాడులు పెరిగాయన్నారు. బీసీలకు రక్షణ చట్టం రజకులకు కూడా ఉపయోగపడుతుందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆరణి శ్రీనివాసులు, వరప్రసాదరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో రజక సంఘాల నాయకులు పాకాల శంకర్, వి. అశోక్, సుధాకర్, కరాటే చంద్ర, యశోద, లింగయ్య, శివయ్య, సుబ్రమణ్యం, శేఖర్, మురళి, రవి, జశ్వంత్ పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే మా 'న్యాయం' గుర్తొస్తుందా...?

- ఎమ్మెల్యే చెవిరెడ్డి తీరుపై మల్లంగుంట రిక్షాకాలనీ వాసుల ఆగ్రహం

తిరుపతి రూరల్/పాకాల, మే 3: ఈ ఎన్నికల్లో పనిచేయండి.. గెలిచిన వెంటనే న్యాయం చేస్తానంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి మాటలు విని వారంతా విస్తుపోతున్నారు. గత ఎన్నికల్లో కూడా ఆయన ఇలాగే చెప్పి పట్టించుకోలేదంటూ వాపోతున్నారు. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటలోని రిక్షాకాలనీకి చెందిన 58 మంది పేద ఎస్సీ కుటుంబాలకు 2013 డిసెంబరులో అప్పటి మంత్రి గల్లా అరుణకుమారి హయాంలో చిగురువాడ ఉత్తరపుకండ్రిగలోని సర్వేనెంబరు 382/2లో ఇంటిపట్టాలు ఇచ్చారు. అధికారుల సర్వే అనంతరం రాళ్లు వేశారు. మట్టిరోడ్డు కూడా నిర్మించారు. కాలనీకి గల్లా జయదేవనగర్ అని నామకరణం చేశారు. పట్టాలు పొందిన ఇద్దరు ముగ్గురు ఇళ్లు కూడా నిర్మించుకున్నారు. ఇంతలో ఈ భూమి తనదంటూ రామానుజపల్లికి చెందిన ఓ రైతు కోర్టులో కేసువేశారు. పట్టాల పొందిన పేదలకు అనుకూలంగా 2017లో కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే వీరిని స్థానికులు కొందరు అక్కడ ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుపడ్డారు. దీంతో ఈ నిరుపేదలు తమకు న్యాయం చేయమని ఎమ్మెల్యే చెవిరెడ్డిని కోరారు. 2019 ఎన్నికల్లో పార్టీకి పనిచేస్తే అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని మాట ఇచ్చారు. 2109 తర్వాత అధికార వైసీపీకి చెందిన కొందరు ఇళ్ల నిర్మాణాలకు అడ్డుపడ్డారు. ఈ ఐదేళ్లలో బాధిత ఎస్సీలు ఎమ్మెల్యే ఇంటికి చాలామార్లు తిరిగారు. ఆయన నేడు,రేపు అంటూ కాలయాపన చేశారు. గతేడాది సెప్టెంబరులో ఈ ప్రజాప్రతినిధి అనుమతితో నాలుగు ఎక్సవేటర్లతో భూమిని చదును చేశామని, ఆధార్, రేషన్‌కార్డు వంటివి చెక్‌చేసి ధ్రువీకరించుకున్నా తమకు న్యాయం జరగలేదని వారు వాపోతున్నారు. ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన రెండ్రోజుల తర్వాత తమను పిలిపించి ఈసారి ఎన్నికల్లో వైసీపీకి పనిచేయండి ..గెలిచిన వెంటనే న్యాయం చేస్తామని ఎమ్మెల్యే చెప్పడంతో వీరందరినీ బాధించింది. ఆయన మాటలు మరోసారి నమ్మి మోసపోలేమంటూ వీరంతా రగిలిపోతున్నారని సమాచారం.

ఇది మోసం కాదా..

- గీత, రిక్షాకాలనీ



గడచిన ఐదు సంవత్సరాలూ మమ్మల్ని తిప్పించారు. తీరా ఇప్పుడు ఎన్నికలొచ్చాక వైసీపీకి పనిచేస్తే తర్వాత న్యాయం చేస్తామని చెప్పడం మోసం కాదా. పేదలను నమ్మించి ఇలా చేయడం మంచి పద్ధతికాదు.

మళ్లీ ఇప్పుడూ అదేమాట

- ఇందిరమ్మ, రిక్షాకాలనీ



ఇన్నాళ్లూ మీ ఇంటికి, ఆఫీసుకు తిప్పించారు. గత ఎన్నికల్లో న్యాయం చేస్తామన్నారు. మళ్లీ ఇప్పుడూ అదేమాట అంటున్నారు. చాలా బాధగా ఉంది. నమ్మినందుకు మోసపోయాం.

ఆరునెలల్లో డ్రైనేజీలు కట్టిస్తామన్నారు...

ఐదేళ్లయినా పట్టించుకోని చెవిరెడ్డి



తిరుమలగిరిలో ఓ ఇంటి వద్ద కాలువ నుంచి పొంగి బయటకు వస్తున్న మురుగునీరు

మంగళం, మే 3: 2019 ఎన్నికలకు పదిరోజుల ముందు ప్రచారంలో భాగంగా వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళం పరిధిలో తిరుమలనగర్ అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి ప్రజలకు పలు హామీలు గుప్పించారు. ఈ సందర్భంగా ప్రజలు డ్రైనేజీ సమస్య గురించి చెబితే.. తాను ఎమ్మెల్యే అయిన ఆరునెలల్లో పక్కాగా నిర్మిస్తానని, తనకు ఓట్లు వేసి గెలిపించాలని చెవిరెడ్డి అభ్యర్థించారు. ఆయన మాటలను నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. ఎమ్మెల్యే ఎపుడు వస్తారా.. డ్రైనేజీకాలువ నిర్మాణం ఎపుడు జరుగుతుందా అని ప్రజలు ఐదేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

450 కుటుంబాలు అల్లాడుతున్నాయి

- రాజశేఖర్, తిరుమలనగర్



నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే డ్రైనేజీ నిర్మిస్తానని చెప్పిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాటలు నమ్మి ఓట్లు వేశాం. ఆయన ఇప్పటి వరకు ఆ హామీ నెరవేర్చలేదు. డ్రైనేజీ కాలువలు లేక మేము పడుతున్న బాధలు వర్ణనాతీతం.

మా డబ్బులతో డ్రైనేజీ శుభ్రం చేసుకుంటున్నాం

- సిద్ధ, తిరుమలనగర్



చంద్రగిరి నియోజకవర్గానికి చెవిరెడ్డిని ఎమ్మెల్యేగా చేసినందుకు డ్రైనేజీని నెలకోసారి 10 ఇళ్లకు కలిపి ఒక్కొక్కరు రూ.500 చొప్పన వేసుకుని మేమేశుభ్రం చేసుకుంటున్నాం. మురుగునీరు రోడ్లపైకి వచ్చి కంపు కొడుతుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం.

తార్కిక ఆలోచనలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న శ్రీధర్

తిరుపతి(విద్య), మే 3: విద్యార్థి దశ నుంచి తార్కిక ఆలోచనలు పెంచుకోవడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని తిరుపతికి చెందిన కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు కెరీర్ అవేర్‌నెస్ అనే అంశంపై కౌటిల్యసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ టి.సంతోష్‌కుమార్‌రెడ్డి, ఆఫీసర్ ఎస్.మోహన్ రెడ్డి, కౌటిల్యసంస్థ సీనియర్ మేనేజర్ ఎన్ఎస్‌రెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3: ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆ సంఘ నేత రత్నకుమార్ కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయంగా ఎన్నికలు నిర్వహిస్తే

కూటమిదే ఘన విజయం

టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తమిదలపాటి దినకర్



మాట్లాడుతున్న దినకర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3: తిరుపతి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు న్యాయంగా, పారదర్శకంగా నిర్వహిస్తే కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమిదలపాటి దినకర్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కూటమిని నైతికంగా ఎదుర్కోలేకనే తిరుపతిలో వైసీపీ నాయకులు రౌడీయిజం చేస్తూ, టీడీపీ నాయకులపై కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన నాయకులను బైండోవర్లు చేస్తుండటం అన్యాయమన్నారు. దీనిపై తాము న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. వైసీపీ నాయకులకు కొంతమంది అధికారులు వత్తాసు పలుకుతున్నారని, కూటమి గెలిచాక వీరందరిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైసీపీ అక్రమాలపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో పాటు కలెక్టర్, రిటర్నింగ్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎల్. వెంకటరమణ, వసుమతి, నగర అధ్యక్షులు వేణుగోపాల్, నాయకులు కంచి శ్యామల, లక్ష్మన్న, శ్రీహరి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి: సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్), మే 3: అవ్వాతాతలకు ఇంటివద్దే పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో పింఛను సొమ్ము జమ చేయడంతో వారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 65,313 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,780 మంది తలనీలాలు సమర్పించారు.

సౌమ్యులమైన మాపై నిందలా? మేం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతిలో ఒక్కటంటే ఒక్క హింస కూడా జరగలేదు. ఆధ్యాత్మిక వాతావరణం పదులరెట్లు పెరిగింది.

- కొద్ది రోజులుగా భూమన కరుణాకరరెడ్డి చెబుతున్న మాటలు ఇవి.

'నాకు ఎమోషన్స్ ఎక్కువ. దేన్నైనా ప్రేమించినా, ద్వేషించినా గాఢంగానే వుంటుంది'.

- తన గురించి తాను తరచూ చెప్పే సత్యం.





వినుడు..వినుడు..వినుడో..

సౌమ్యుల గాథ!

తిరుపతి నగరంలో ఎన్నికల వేళ రౌడీయిజం గురించిన చర్చ బలంగా జరుగుతోంది. ఆరణి శ్రీనివాసులు చిత్తూరు, వేలూరుల నుంచి గూండాలను తీసుకువచ్చారని భూమన ఆరోపణ చేస్తుండగా, కడప రౌడీలను తిరుపతిలో దించేశారని ఎన్డీయే కూటమి అంటోంది. ఇంతకీ ఎవరి మాటల్లో ఎంత నిజం ఉంది? తిరుపతి చరిత్ర ఏమి చెబుతోంది? భూమన కరుణాకరరెడ్డి ఎంత సౌమ్యుడు అని నగరం నమ్ముతోంది? మొత్తం మీద తిరుపతిలో ఎన్నికలు ప్రశాంతంగా జరగవని వర్తమాన రాజకీయ వాతావరణం భయపెడుతోంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల గతాన్ని తిరుపతి ప్రజలు నెమరు వేసుకుంటున్నారు. అందులో కొన్ని ఇవి..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

1999 ఎన్నికలు

ఎన్నికలు ఇంకో నాలుగు నెలల్లో ఉండగా కాంగ్రెస్ అభ్యర్థిగా వెంకటరమణ పేరు దాదాపుగా ఖరారైంది. తనకు టికెట్ ఆశిస్తున్న భూమన కరుణాకరరెడ్డి ఒక పాతబాకీ అంశాన్ని వెలుగులోకి తెచ్చి వెంకటరమణ ప్రతిష్టను దెబ్బ తీయడానికి ప్రయత్నించారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఓ సినీ నిర్మాత బాకీ తీర్చలేదనే అంశంపై మౌర్య హోటల్లో వున్న వెంకటరమణపై 1998 డిసెంబరు1న దాడి జరిగింది. భూమన కరుణాకర్ రెడ్డి, వైఎస్ వివేకానంద రెడ్డిలపై కేసు (ఎఫ్ఐఆర్ నెం:358/98)నమోదైంది. సెక్షన్ 147, 448, 427, 323, 506, 365ల కింద అరెస్ట్ చేసి ఇద్దరినీ జైలుకుపంపారు. కొసమెరుపు ఏమిటంటే.. 1999 ఎన్నికల్లో వెంకటరమణకే తిరుపతి కాంగ్రెస్ టికెట్ లభించింది.

2009 ఎన్నికలు

తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజారాజ్యం పార్టీ తరఫున మెగాస్టార్ చిరంజీవి, కాంగ్రెస్ అభ్యర్థిగా కరుణాకర్ రెడ్డి పోటీ చేశారు. పోలింగ్ ముందు రోజు చిరంజీవి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకుని కెన్సెస్ హోటల్ నుంచి తిరుగు ప్రయాణమవుతున్నారు. హోటల్ గది నుంచి చిరంజీవిని కదలనివ్వకుండా తనిఖీల పేరుతో ఇబ్బంది పెట్టారు. కరుణాకర్ రెడ్డి అనుచరులు హోటల్ వద్ద మొహరించి నానా హంగామా సృష్టించారు. దీంతో చిరంజీవి తన ప్రయాణాన్ని రద్దుచేసుకుని పోలింగ్ రోజు తిరుపతిలోనే ఉండిపోయారు. కొసమెరుపు ఏమిటంటే.. చిరంజీవి ఘన విజయం సాధించారు. ఎన్నికల ఫలితాల్లో కరుణాకర్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకున్నారు.

2014 ఎన్నికలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దివంగత వెంకటరమణ, వైసీపీ అభ్యర్థిగా భూమన కరుణాకర్ రెడ్డి తలపడ్డారు. వెంకటరమణకు లభిస్తున్న ఆదరణను చూసి అప్పటికే వైసీపీలో అసహనం పెరిగిపోయింది. పోలింగ్ మొదలైంది. సరళి టీడీపీకి అనుకూలంగా కనిపించింది. జీవకోన పోలింగ్ బూత్‌లో ఇద్దరు అభ్యర్థులూ ఎదురెదురుగా తారసపడ్డారు. తీవ్ర అసహనంతో వెంకటరమణ చెంపపై భూమన కరుణాకరరెడ్డి కొట్టారని మీడియాలో హోరెత్తింది. దీనిపై వెంకటరమణ వర్గీయులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. కొసమెరుపు ఏమిటంటే.. కరుణాకరరెడ్డి 41,539 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయారు. చిరంజీవి రాజీనామా చేయడంతో 1012లో జరిగిన ఉప ఎన్నికల్లో వెంకటరమణ మీదే 18 వేల ఆధిక్యతతో గెలిచిన కరుణాకరరెడ్డి 2014లో ఇదే వెంకటరమణ చేతిలో దారుణంగా ఓడిపోవడం.

2019 ఎన్నికలు

వైసీపీ రాష్ట్రమంతా ప్రభంజనం సృష్టించిన ఈ ఎన్నికల్లో ఓటమి అంచులదాకా చేరుకున్న కరుణాకరరెడ్డి ఆఖర్లో కేవలం 708 ఓట్ల ఆధిక్యతతో సుగుణమ్మపై గెలిచారు. ఆ తర్వాత తరుపతిలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికలు జరిగిన తీరు రాష్ట్రమంతా నివ్వెరపోయేలా చేసింది. భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలోనే తిరుపతిలో ఈ ఎన్నికలు జరిగాయి.

- వైసీపీ నాయకులు కార్పొరేషన్ ఎన్నికల్లో రౌడీమూకను దించి నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారు. అభ్యర్థులను బెదిరించారు. నామినేషన్ పత్రాలు చించివేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లకుండా అందరూ చూస్తుండగానే అడ్డుకున్నారు. బూతులు తిట్టారు.
- టౌన్‌బ్యాంకు ఎన్నికల్లోనూ ఖాతాదారులైన ఓటర్లను రానీయకుండా ఇష్టారాజ్యంగా గుద్దుకుని అన్ని స్థానాలు తామే గెలిచినట్టు సంబరాలు చేసుకున్నారు.
- తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లతో జాతర చేశారు. తమిళనాడు, చిత్తూరునుంచి బస్సుల్లో యాత్రకు తీసుకొచ్చినట్టు దొంగ ఓటర్లను దించి మెజారిటీ చూపించుకున్నారు. ఏకంగా ఎన్నికల అధికారుల లాగిన్‌లోకే జొరబడి 34 వేల దొంగ ఓట్లు సృష్టించారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బలైన ఈ సంఘటనకు మూల కారకుడు కరుణాకరరెడ్డి కుమారుడు భూమన అభినయరెడ్డి అని విపక్షాలు ఆరోపించాయి.
- గ్రాడ్యుయేట్ల ఎన్నికలనీ అపహాస్యం చేశారు. కాలేజీ మెట్లక్కని వైసీపీ కార్పొరేటర్లు కూడా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేశారు.

2024 ఎన్నికలకు కుట్ర స్కెచ్?

పది రోజుల్లో పోలింగ్ జరగనుంది. ఈలోపు తిరుపతిని ఒక భయభ్రాంత వాతావరణంలోకి తీసుకెళ్లి ఉద్యోగులు, కొన్ని సామాజికవర్గాలను ఓటింగ్‌కు దూరంచేయాలన్న పన్నాగం పన్నుతున్నారనే అనుమానం ఎన్డీయే కూటమిలో వ్యక్తం అవుతోంది. పోలింగ్ రోజు మొదటి రెండు గంటల్లో వైసీపీ సానుకూల వర్గాలనుంచి ఓట్లు వేయించేసుకుని, ఆ తర్వాత అవాంఛనీయ అలజడిలు సృష్టించి వారికి వ్యతిరేకంగా ఉన్న ఉద్యోగ, విశ్రాంత సిబ్బంది, వ్యాపారస్తులు వంటివారిని పోలింగ్ కేంద్రాలకు రానివ్వకుండా చేయడానికే రౌడీలూ, గూండాలూ అంటూ పదేపదే మాట్లాడుతున్నారని అనుమానిస్తున్నారు. అందులో భాగంగానే ప్రచారంలోనూ ఉద్రిక్తత సృష్టిస్తున్నారని భావిస్తున్నారు. ఎన్డీఏ కూటమి ప్రచారం చేసే సమయంలోనే వైసీపీ శ్రేణులు అడ్డుగా నిలబడడం, కవ్వింపు చర్యలు దిగడం వంటి ఘటనలు జరిగాయని అంటున్నారు. ఇదంతా భూమన బ్యాచ్ స్కెచ్ అని వీరు ఆరోపిస్తున్నారు.

గాజు గ్లాసు.. సీరియల్ నెం.3కు ఓటేయండి

35వ డివిజన్లో ఆర్సీ మునికృష్ణ విస్తృత ప్రచారం



35 డివిజన్‌లో ప్రచారం చేస్తున్న టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మే 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న ఎన్డీయే కూటమి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపుకోసం బ్యాలెట్‌లో గాజు గ్లాసు (సీరియల్ నెంబరు 3)పై, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని 35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 35వ డివిజన్లో బూత్ నెంబరు 108, 109, 110, 111ల్లోని భవానీనగర్, వెంకటగిరి క్వార్టర్స్, టీటీడీ ఏడీ బిల్డింగ్ రోడ్డు, ఎస్వీ చిల్డ్రన్స్ హైస్కూల్ రోడ్డులో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, హరిబాబు అలియాస్ చిన్ని, యూనిట్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, టీడీపీ నాయకులు హేమాద్రి, సురేష్, సుజాతమ్మ, దర్శన్ రెడ్డి, రవి కుమార్ రెడ్డి, జనసేన నాయకులు డాక్టర్ హరి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే అభ్యర్థులను గెలిపించండి

టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి



గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేయాలంటూ 27వ డివిజన్లో ప్రచారం చేస్తున్న పులుగోరు మురళీకృష్ణా రెడ్డి

తిరుపతి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే బలపరుస్తున్న తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌లను గెలిపించాలని టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం 27వ డివిజన్లో పర్యటించారు. మేయర్ వార్డులోనే జనసేనకు ఓట్లు పడతాయన్న కక్షతో నాలుగైదు రోజులుగా తెలుగుగంగ నీటిని నిలిపివేయడం దారుణమన్నారు. డివిజన్ అధ్యక్షుడు నాగ ప్రతాప్, నాయకులు మునిరాజా, దేవరాజులు, జేఎంసీ వెంకటేష్, రమేష్, ఆది, భాస్కర్, సాయి, ఖాదర్, రమేష్ పాల్గొన్నారు.

తిరునగరిని సరికొత్తగా అభివృద్ధి చేస్తాం

జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, మే 3: ప్రపంచ పుణ్యక్షేత్రమైన తిరునగరిని సరికొత్తగా అభివృద్ధి చేస్తామని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ అన్నారు. టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపుకోసం కిరణ్‌రాయల్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. శుక్రవారం స్థానిక 18వ డివిజన్‌లోని ఎస్వీఐకాలనీ, రాయల్‌నగర్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు గాజుగ్లాసు చూపిస్తూ.. ఈ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను గెలిపించాలని కోరారు. అలాగే మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి.. వివరించారు. యువత, మహిళలు, కార్మికులు, వ్యాపారస్తులను ప్రత్యేకంగా పలకరించి ఉత్సాహం నింపారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అభివృద్ధే ధ్యేయంగా పాలనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, షరీఫ్, రాజేంద్ర, సాయి, సిద్ధు, లోకేశ్, టీడీపీ, జనసేన ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాజుగ్లాసు గుర్తుపై ఓటేయాలని కోరుతున్న కిరణ్‌రాయల్

అవినీతి భూమన కుటుంబాన్ని తిరస్కరించడం ఖాయం

- ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



ఆరణి సమక్షంలో జనసేనలో చేరిన కొండా రాజబాబు తదితరులు

తిరుపతి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, ఆయన తనయుడు అభినయ్ రెడ్డిల అరాచకాలను ప్రజలు తిరస్కరించడం ఖాయమని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ప్రతిపనిలో కమీషన్ తీసుకుని వేల కోట్ల రూపాయలు తండ్రీ, కొడుకులు దోచుకున్నారని ఆరోపించారు. జనసేన నాయకులు కొండా రాజబాబు నాయకత్వంలో ప్రగతినగర్‌కు చెందిన రాజ, దిలీప్, నందిని, రవితేజలతో పాటు వంద మంది పార్టీలో చేరారు. వీరికి ఆరణి శ్రీనివాసులు పార్టీ కండువా కప్పిజనసేనలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆరణి మాట్లాడుతూ తండ్రీ కొడుకులు అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకుని తిరుపతిలో అరాచకాలు సృష్టించారని ఆరోపించారు. కరుణాకర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తిరుపతి అభివృద్ధికి తీసుకురాలేదని చెప్పారు. కొడుకు గెలుపునకు టీటీడీ చైర్మన్ పదవిని అడ్డం పెట్టుకున్నాడని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే, టీటీడీ ఉద్యోగులకు ఎన్డీయే కూటమి వ్యతిరేకమని అసత్య ఆరోపణలు ప్రచారం చేశారని మండిపడ్డారు. రెండు నెలలుగా టీటీడీ ఉద్యోగులు పెరిగిన జీతం అందుకున్నది నిజమా.. కాదో? కరుణాకరరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండు చేశారు.

'ఆరణి' గెలుపు కోసం గంగమ్మకు పూజలు

తిరుపతి జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌లను భారీ మెజార్టీతో గెలవాలని, అలాగే కూటమి అధికారం చేపట్టి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని శుక్రవారం తాతయ్యగుంట గంగమ్మ గుడి మాజీ చైర్మన్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పాలకమండలి మాజీ సభ్యులు, మహిళలతో కలసి వెయ్యి కళ్ల దుత్తలతో అలయ ప్రదక్షిణ చేసి, మోకాళ్లపై కూర్చొని వేడుకున్నారు.



వేయికళ్లదుత్తలతో మోకాళ్లపై నిలబడి వేడుకుంటున్న ఆర్సీ మునికృష్ణ, తదితరులు

రీపోలింగ్‌కు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలి

భారత సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి(కలెక్టరేట్), మే 3: జిల్లాలో రీపోలింగ్‌కు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని భారత సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సార్వత్రిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అబ్జర్వర్లు ఉజ్వల్‌కుమార్ ఘోష్, అరవింద్‌సాల్వే మాట్లాడుతూ అక్రమ మద్యం, నగదు, తాయిలాల పంపిణీని నిరోధించడానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు సుమారు రూ.20కోట్ల వరకు సీజ్ చేశామన్నారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని చంద్రగిరి, తిరుపతిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి వందశాతం వెబ్‌కాస్టింగ్, అదనపు కేంద్ర బలగాలను నియమించామన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ జిల్లాకు అదనంగా మరో మూడు కంపెనీల సాయుధ బలగాలు అవసరమన్నారు. అబ్జర్వర్లు ప్రదీప్‌కుమార్, శేషాద్రి, మీను ఓలా, డీఆర్వో పెంచలకిషోర్ పాల్గొన్నారు.

తిరుమలలో భాష్యకారుల ఉత్సవం ప్రారంభం



తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం శుక్రవారం ప్రారంభమయింది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరగనుంది. తొలిరోజున ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటిగంట అనంతరం రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా జీయంగార్లు దివ్యప్రబంధ గోష్ఠి చేపట్టారు. ఈకార్యక్రమంలో పెద్ద, చిన్నజీయర్ స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా, 12న భాష్యకారుల సాత్తుమొర జరగనుంది. రామానుజులవారి జన్మించిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ ఆలయంలో భాష్యకారుల సాత్తుమొరను నిర్వహిస్తారు.

ఎన్డీయే కూటమికే ముస్లింల మద్దతు

టీడీపీ సీనియర్ నాయకుడు ఊకా విజయ్ కుమార్



ఆరణి శ్రీనివాసులును గెలిపించాలని కోరుతున్న ఊకా విజయ్‌కుమార్

తిరుపతి, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమికే ముస్లింల మద్దతు ఉందని టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తరఫున శుక్రవారం స్థానిక నెహ్రూ నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మేనిఫెస్టోలో మైనార్టీలకు కేటాయించిన సంక్షేమ పథకాలను విజయ్ కుమార్ వివరించారు. జనసేన ఎన్నికల గుర్తయిన గాజు గ్లాసుకు ఓటు వేసి ఆరణి శ్రీనివాసులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హయాద్, జాఫర్, ఖాజా, ఖాదర్ బాషా, అక్రమ్, వసీం, రఫీ, ఆదినారాయణ, మునికృష్ణ, మధు, జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు





శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఉమేష్ - నరసింహా, దుర్గేష్

తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కూటమి ఎంపీ అభ్యర్థులు వరప్రసాద్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమేష్ అడిగ, ఇన్‌కమ్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్ నరసింహ, ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ ఉన్నారు.

రేపు, ఎల్లుండి పోస్టల్ బ్యాలెట్ : ఆర్వో అదితిసింగ్

తిరుపతి అర్బన్, మే 3: తిరుపతి నియోజకవర్గానికి సంబంధించిన ఉద్యోగులు ఈనెల 5, 6వ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్వో అదితిసింగ్ తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నందకిషోర్



తిరుపతి(విద్య), మే 3: ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరుపతికి చెందిన తూపల్లి నందకిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.నూర్ మహ్మద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆటో ఫైనాన్సు కంపెనీలపై విజిలెన్స్ దాడులు

తిరుపతి(నేరవిభాగం), మే 3: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం తిరుపతి రీజనల్ విజిలెన్స్ అదనపు ఎస్పీ ఈశ్వర రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్సు అధికారులు అన్ని ఆటో మొబైల్ ఫైనాన్సు కంపెనీలపై దాడులు చేశారు. రాష్ట్ర విజిలెన్సు కమిషనర్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలో దాదాపు 250 షాపులు, చిత్తూరు జిల్లాలో 250 షాపులపై దాడులు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, వాటికి సంబంధించిన అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ఆటోమొబైల్ దుకాణదారులు చాలా మంది జీఎస్టీ సక్రమంగా చెల్లించనట్లు తెలిసింది. ఈ దాడుల్లో డీసీటీవో మునీశ్వరమ్మ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మచ్చా..ఈయబ్బే గెలుస్తాడంటావా?



'మచ్చా రేయ్.....ఎవర్రా వీళ్లంతా?' వీధిలో జేజేలు పలుకుతూ వెళ్తున్న ఎన్నికల ప్రచారం బృందాన్ని చూస్తూ అడిగాడు సుబ్బయ్య. 'ఉత్తరా దోడంటనే.. ఫ్యానోళ్లు, సైకిలోళ్లతో పోటీపడి సందడి చేస్తావుండాడు' నవ్వుతూ టీ గ్లాసు అందుకున్నాడు రామయ్య. 'దుడ్లు బలే సెలవుజేస్తావుండారంటలే. బాగా వున్నోడంట మామా..' సుబ్బయ్య గొంతులో కాస్త అసూయ ధ్వనించింది. 'ఔను యా మామా.. ఎవరు ఎన్ని ఓట్లు ఏపిస్తారో అన్ని వేలు ఇచ్చేస్తా.. అని చెప్తున్నాడంటగదా?' ఆశగా అడిగాడు రామయ్యని. 'అవును మచ్చా.. ఆపార్టీలో, ఈపార్టీలో అలిగినోళ్లంతా ఎగబడి ఈయబ్బతో తిరగతావుండారంటలే. దుడ్లు దండిగా పడతావుల్లా.' అని నవ్వాడు రామయ్య. 'అట్టయితే గెలిచిపోతాడంటావా?' అమాయకంగా అడిగాడు సుబ్బయ్య. పకపకా నవ్వి చెప్పాడు రామయ్య.. 'మామా మనూర్లో జనాలు యేమన్నా తెలివిమాలినోళ్లా యేమి.. దుడ్లు చేదా.. ఎవురిచ్చినా కాదనకుండా తీసుకుంటారు. ఎవరు పిలిచినా ప్రచారానికి పోతారు. ఓట్లదినం.. లోపలికి పొయ్యి ఎవరికి గుద్దాల్నో వాళ్లకు సైగ్గా గుద్దేసి వచ్చేస్తారు.'

- సత్యవేడు

ఇదీ మందుల


రండి.. రండి.. రండి.. దయచేయండి



పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిపై రాజకీయ నాయకులకు ఎక్కడ లేని ప్రేమా పుట్టుకొచ్చింది. ఇన్నాళ్లూ వాళ్లెక్కడున్నారో తెలియకపోయినా, కనీసం ముఖ పరిచయం లేకపోయినా వారికి తెగ ఫోన్లు చేసేస్తున్నారు. హలో అన్నా.... తెలుసు కదా...13న ఓట్ల పండగ వుంది. తప్పకుండా రండి.. మీ ఓటు ఫలానా గుర్తుకు వేసి వెళ్ళండని అభ్యర్థిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు వలస వెళ్ళిన వేలాది మంది జిల్లా ఓటర్లపై తిరుపతి నాయకులు దృష్టి పెట్టారు. స్థానికంగా ఇలాంటి వారి వివరాలు సేకరించి వరుస పెట్టి ఫోన్లు చేసి రప్పించే పనిలో బిజీగా ఉన్నారు. ముక్కూమొఖం చూడకపోయినా మాట కలిపి వీరు ఫోన్లో ప్రేమ ఒలకబోస్తున్నారు. ప్రతి ఓటూ కీలకంగా భావించిన పార్టీలు ఈ పనిని ప్రత్యేకించి స్థానికంగా కొందరికి అప్పగించాయి. వలస ఓటర్లను రకరకాలుగా ఆకర్షించి రప్పించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. బస్సు, రైళ్లలో రిజర్వేషన్లు చేసి టికెట్లు పంపుతున్నట్టు సమాచారం. నాయకుల నుంచి అదేపనిగా ఫోన్లు వస్తుండటంలో ఈ వలస జీవులు విస్తుపోతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

మా ఊర్లో మీ పెత్తనమేంటి!



ఎన్నికల ఇన్‌చార్జిల తీరు వైసీపీ లోకల్ కేడరుకు సుతరామూ నచ్చడం లేదు. మామీద మీ బోడి పెత్తనమేంటంటూ తిరుగుబాటు చేస్తున్నారు. ఎన్నికల కోసం రేణిగుంట మండలానికి వైసీపీ నాయకత్వం బయట ప్రాంతాలకు చెందిన ముగ్గురిని ఇటీవల మండల ఇన్‌చార్జిలుగా నియమించింది. అయితే వీరు స్థానికంగా ప్రతి పనిలోనే వేలు పెడుతున్నారంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గుర్రు మీదున్నారు. మీడియా వార్తల వల్ల గ్రాఫ్ పడిపోతోందని, తమకు చెప్పకుండా ఏ పనీ చేయకూడదని హుకుం జారీ చేయడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకరిద్దరు చేసిన తప్పులను సాకుగా చూపుతూ సదరు ఇన్‌చార్జిలు అందరినీ దోషులుగా చూడడం అసలుకే మోసం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అయినా స్థానికంగా అవగాహన ఉన్న తమను కాదని బయట వ్యక్తులను పరిశీలకులుగా నియమించడమేంటని మండిపడుతున్నారు. ఇలాంటి 'సారథు'లు విజయానికి కాకుండా ఓడించేలా వ్యవహరిస్తున్నారని తలపట్టుకుంటున్నారు. పార్ట్‌టైం పరిశీలకులకు,స్థానిక నాయకులకు మధ్య ఏర్పడిన అంతరం రోజురోజుకూ పార్టీకి తలనొప్పిగా తయారయింది.

- రేణిగుంట


జన చేతనం

www.andhrajyothy.com
శనివారం 4 మే 2024

పాదయాత్రే తనను నాయకుడిగా మలచిందని ఆయన చెబుతాడు. రాష్ట్రం దుస్థితి, ప్రజల కష్టాలు కళ్ల చూసిన తర్వాతనే వైసీపీ మేనిఫెస్టో రూపొందించానని అంటారు.
నిజమేనా? నమ్మచ్చా?
జగన్ మాటలకూ చేతలకూ నడుమ అగాధాలు ఉన్నాయనేందుకు సాక్ష్యమే ఈ కథనం..

జగన్ నడిచిన దారులు

ఇప్పుడిలా ఉన్నాయి



2018 జనవరి 10న చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం అనుప్పల్లిలో జిల్లాలోకి ప్రవేశించిన జగన్.. నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల మీదుగా జనవరి 30న నెల్లూరు జిల్లాలోకి నడక సాగించారు. జిల్లాలో మొత్తం 184 కిలోమీటర్లు నడిచారు. ఎందరితోనో మాట్లాడారు. అధికారంలోకి రాగానే అన్నీ మార్చేస్తానంటూ హామీలెన్నో ఇచ్చారు. తలలు నిమిరి, నుదుట ముద్దులు పెట్టి, బుగ్గలు గిల్లి ఆయన చెప్పిన మాటలు నమ్మిన ప్రజలు ఒక్క ఛాన్స్ ఇచ్చారు. అంతే ఆ తర్వాత నడిచి వచ్చిన దారులనే జగన్ మరచిపోయారు. గాల్లో తప్ప నేలమీదకు దిగడం మానేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాకే బస్సెక్కారు. మాట తప్పనూ, మడమ తిప్పనూ, చేసేదే చెబుతానూ.. అని వేదికలమీద దబాయించి అబద్ధాలు చెప్పే ఈ నాయకుడి పాలనలో అభివృద్ధి ఎలా ఉందో ఆయన నడిచిన దారులే సాక్ష్యం. పాదయాత్ర సమయంలో సవ్యంగా ఉన్న ఈ రోడ్లు ఇప్పుడు ఇలా ఉన్నాయి...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వైసీపీ పాలనకు అద్దం పడుతూ దుస్థితిలో రోడ్లు

నియోజకవర్గం: సత్యవేడు



బుచ్చినాయుడు కండ్రిగ మండలం పల్లమాల నుంచీ ఆలత్తూరు వరకూ శిథిలమైన రోడ్డు

పాదయాత్ర: 2018 జనవరి 22
నడిచిన గ్రామాలు: బుచ్చినాయుడు కండ్రిగ మండలం చల్లమాంబపురం, పార్లపల్లి, పల్లమాల, ఆలత్తూరు.
నడిచిన దూరం: 15 కిలోమీటర్లు
జగన్ నడిచిన రోడ్డు స్థితి: పల్లమాల నుంచీ ఆలత్తూరు వరకూ ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్వహణకు, మరమ్మతులకు నోచుకోక దారుణంగా తయారైంది. కంకర, మట్టి తప్ప తారు రోడ్డన్నదే కనిపించడం లేదు. ఈ మార్గంలో ప్రయాణానికి వాహనదారులు నరకం చూస్తున్నారు.

నియోజకవర్గం: సూళ్ళూరుపేట



పాదయాత్ర: 2018 జనవరి 23 నుంచీ 26 వరకు
నడిచిన మండలాలు: పెళ్ళకూరు, నాయుడుపేట, ఓజిలి
నడిచిన దూరం: 45 కిలోమీటర్లు
జగన్ నడిచిన రోడ్డు స్థితి: శిరసనంబేడు రాజుపాలెం నుంచీ చావలి చెక్‌పోస్టు వరకూ ఆరు కిలోమీటర్ల దూరం భారీ గోతులు ఏర్పడ్డాయి. తారు, కంకర పూర్తిగా తొలగిపోయి మట్టిరోడ్డుగా మారింది. దుమ్ము రేపుతూ వాహనదారులకు నరకం చూపుతోంది.

పెళ్ళకూరు మండలం శిరసనంబేడు రాజుపాలెం నుంచీ చావలి చెక్‌పోస్టు నడుమ మట్టిరోడ్డుగా మారిన తారు రోడ్డు.

నియోజకవర్గం: శ్రీకాళహస్తి



ఏర్పేడు మండలం మడిబాక నుంచీ రాజుల కండ్రిగ వరకూ రోడ్డు అధ్వానంగా వున్న దృశ్యం

పాదయాత్ర: 2018 జనవరి 16 నుంచీ 22 వరకు
నడిచిన మండలాలు: ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు
నడిచిన దూరం: 42 కిలోమీటర్లు
జగన్ నడిచిన రోడ్ల స్థితి: మడిబాక నుంచీ రాజుల కండ్రిగ వరకూ ఒకటిన్నర కిలోమీటరు, సదాశివపురం నుంచీ మోదుగులపాలెం వరకూ నాలుగున్నర కిలోమీటర్ల దూరం, అలాగే కోబాక నుంచీ ఏర్పేడు దాకా మూడు కిలోమీటర్లు రోడ్డు పరమ అధ్వానంగా ఉన్నాయి.

ఏర్పేడు మండలం సదాశివపురం నుంచీ మోదుగులపాలెం నడుమ రోడ్డు దెబ్బతిన్న దృశ్యం

నియోజకవర్గం: నగరి



పాదయాత్ర తేదీలు: 2018 జనవరి 14 నుంచీ 16 వరకు
నడిచిన గ్రామాలు: వడమాలపేట మండలం పత్తిపుత్తూరు, అప్పలాయగుంట, ఎనమలపాలెం, తిరుమణ్యం, వడమాలపేట, పాదిరేడు, టీసీ అగ్రహారం.
నడిచిన దూరం: 18 కిలోమీటర్లు
జగన్ నడిచిన రోడ్ల స్థితి: పరమ అధ్వానంగా వున్నాయి. ఎనమలపాలెం నుంచీ తిరుమణ్యం వరకూ తీవ్ర దుస్థితిలో వుంది.

వడమాలపేట మండలం ఎనమలపాలెం నుంచీ తిరుమణ్యం వరకూ రోడ్డు దుస్థితి.

నియోజకవర్గం: గూడూరు

పాదయాత్ర: 2018 జనవరి 27 నుంచీ 29 వరకూ
నడిచిన గ్రామాలు: గూడూరు మండలం కాండ్ర, తిమ్మసముద్రం, కొండాగుంట, ఆరిచెర్ల, గాంధీనగర్, మాలవ్యనగర్, గూడూరు, నెల్లకూరు, చెన్నూరు, తిప్పవరప్పాడు.
నడిచిన దూరం: 24 కిలోమీటర్లు
జగన్ నడిచిన రోడ్లు స్థితి: నెల్లకూరు నుంచీ చెన్నూరు వరకూ నాలుగు కిలోమీటర్ల పొడవునా రోడ్డు అధ్వానంగా మారింది. తారు, కంకర లేచిపోయి వెడల్పాటి గోతులు ఏర్పడి వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి.



నెల్లకూరు నుంచీ చెన్నూరు నడుమ ఛిద్రమైన రోడ్డు

● నోట్ దిస్ పాయింట్

అక్కడ ఓటు వేయకపోతే నేరమే!

ప్రజాస్వామ్యంలో ఓటు అన్నది పౌరుల హక్కు అని చెబుతారు. నిజానికి ఓటు అన్నది పౌరుల బాధ్యత కూడా. నాయకులంతా ఇంతే.. నేనెందుకు ఓటు వేయాలి అని మనదేశంలో చాలామంది ఓటు వేయడానికి ఇష్టపడరు. అందుకే పోలింగ్ శాతం 60 శాతం నమోదవుతూ ఉంటుంది. కొన్ని దేశాల్లో ఓటు వేయకపోవడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆస్ట్రేలియాలో ఓటు వేయకుంటే చిన్నపాటి నేరమే. అందుకు తగ్గ కారణం, అక్కడ ప్రభుత్వానికి చూపించాల్సిందే. లేదంటే రూ.1000 జరిమానా చెల్లించాలి. లేకపోతే నేరస్తుడిగా పరిగణిస్తారు. అర్జెంటినాలో ఓటు వేయనివారికి సంవత్సర కాలంపాటు ప్రభుత్వ పథకాలు తొలగిస్తారు. పెరూ దేశంలో ఓటు వేయని వారికి పెద్దశిక్షలు అమలు చేస్తారు. వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు. బెల్జియంలో ఓటు హక్కు వినియోగించుకోని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. నాలుగు పర్యాయాలు ఓటు వేయనివారికి పదేళ్లపాటు ఓటు హక్కు రద్దు చేస్తారు. ఈ కారణంగా ఓటు వేయని వారు ప్రభుత్వ ఉద్యోగ అర్హత కోల్పోతారు. గ్రీస్, ఈజిప్టు దేశాల్లో ఓటుహక్కు వినియోగించుకోని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. న్యాయస్థానంలో సరైన కారణం చూపని వారిని జైలుకు పంపుతారని ఆయా దేశాల్లో ఉన్న ఎన్‌ఆర్‌ఐలు అంటున్నారు. మన దేశంలో కూడా వందశాతం పోలింగ్ అయ్యేందుకు ఇలాంటి చట్టాలు ఎప్పుడు వస్తాయో వేచి చూడాల్సిందే.

- గూడూరు అర్బన్



ఓటు ఎక్కడుందో తెలుసుకోండిలా..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గడువు దగ్గరకొస్తోంది. చాలామందిలో ఓటు ఎక్కడ ఉంది..? ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలి? లాంటి సందేహాలుంటాయి. వీటిని నివృత్తి చేసేందుకు తిరుపతి కలెక్టరేట్‌లో అధికారులు కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. 1950 నంబరుకు ఫోన్ చేసి ఓటరు పేరు, నియోజకవర్గం, కార్డు నెంబరు(ఎపిక్ నెంబర్) చెబితే పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. 0877-2236007 నంబరుకు ఫోన్ చేసినా ఈ సమాచారం అందిస్తారు. ఎన్నికల ప్రవర్తనావళి ఉల్లంఘనలు, రాజకీయ పార్టీ నేతల ప్రలోభాలు, తాయిలాలు లాంటి సమాచారం ఈ నంబరుకు తెలియజేయవచ్చు. మొబైల్ ఫోన్‌లో 1950ఈసీఐ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటరుకార్డు(ఎపిక్)నెంబరు నమోదు చేస్తే కొద్ది సమయంలో పేరు,బూత్ నెంబరు, ఓటు సీరియల్ నెంబరు వివరాలతో సహా సంక్షిప్త సమాచారం వస్తుంది. ఓటర్ హెల్ప్‌లైన్ అనే యాప్‌లోనూ ఫోన్ నంబరు, ఎపిక్ నెంబర్‌తో వివరాలు తెలుసుకోవచ్చు.

- తిరుపతి (కలెక్టరేట్)

హామీలో హుష్

మత్స్యకారులకు కిలివేటి వల

● మూణ్ణాళ్ల ముచ్చటగా తమిళ పాఠశాల

మేం అధికారంలోకి వస్తే పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం...
తమిళ పాఠశాలను ఏర్పాటు చేస్తాం...

2019 ఎన్నికలకు ముందు వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తడ మండలం ఇరకందీవి పాళెంతోపుకుప్పంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ ఇది.

ఇరకందీవిలోని పాళెంతోపు కుప్పంలో తమిళ పాఠశాల ఏర్పాటు మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. ఎన్నికల్లో గెలిచాక 2019 సెప్టెంబరు 16న అధికారపార్టీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, అప్పటి సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఇతర అధికారులను వెంటబెట్టుకుని పాళెంతోపు కుప్పం వెళ్లారు. ఆదరాబాదరాగా తమిళ పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి రిబ్బన్ కట్ చేశారు. ఇక్కడున్న 45 మంది విద్యార్థుల చదువుల కోసం ఇద్దరు తమిళ విద్యావలంటీర్లను నియమించినట్లు ఆయన చెప్పారు. త్వరలోనే తమిళ మీడియం రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఇక పడవల్లో తమిళనాడు పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే విద్యాసంవత్సరానికి పిల్లలంతా ఇక్కడే తమిళ మీడియంలో చదువుకునేలా రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. దాంతో ఆ రోజు మత్స్యకార కుటుంబాలు సంతోషంలో మునిగి తేలిపోయాయి. కానీ వారి ఆనందం పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. విద్యావలంటీర్లు పది రోజులకే చల్లగా జారుకున్నారు. శాశ్వత ఉద్యోగులను నియమిస్తామన్న ఎమ్మెల్యే మాట నెరవేరలేదు. దీంతో నెలరోజుల్లోనే పాఠశాల మూతపడింది. ఎమ్మెల్యే సంజీవయ్య తమ చెవిలో పువ్వు పెట్టారని ఇరకం కుప్పం గ్రామస్తులు గుర్తించారు. ఎప్పటిలాగే ఇక్కడి పిల్లలు ఉస్సూరంటూ పడవలో తమిళనాడు పాఠశాలకు వెళ్తున్నారు.

- తడ




పాళెంతోపుకుప్పంలో అధికారులు ఏర్పాటు చేసిన తమిళ పాఠశాల

జన చేతనం

ప్రతి బిడ్డను చదివించే బాధ్యత తనదన్నారు. ఒక తల్లికి ఎంతమంది బిడ్డలుంటే అంతమందికి ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తానన్నారు. విపక్ష నేతగా ఇలా మాటలు చెప్పి 2019 ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. రూ.15 వేలను కాస్త రూ.13 వేలు చేశారు. ఒక బిడ్డకే అమ్మఒడిని పరిమితం చేశారు. ఆంక్షల పేరిట మరికొంత మందిని అనర్హులను చేశారు. ఇలా ఐదేళ్లలో 80 వేల మందికి అమ్మఒడిని దూరం చేశారు.

- చిత్తూరు (సెంట్రల్)



అమ్మ జగనా..!

నొక్కింది ఉత్తుత్తి బటనే

మాట తప్పిన సీఎం

- అమ్మ ఒడికి 80 వేల మంది దూరం
- ఏటా ఆంక్షలతో కోతలు
- టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థికి అమ్మకు వందనం

'నేను సీఎం కాగానే 2019-20 విద్యా సంవత్సరంలోనే అమ్మ ఒడి ఇచ్చా. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా' అంటూ చిత్తూరులో 2020 జనవరిలో అమ్మఒడి పథకాన్ని సీఎం జగన్ ప్రారంభించారు. ఈ పథకం కోసం తొలి ఏడాది ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2,42,672 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ఈ సంఖ్య 2022-23 నాటికి (నాలుగేళ్లలో..) 1,62,477 మందికి చేరింది. అంటే 80,195 మంది అమ్మఒడికి దూరమయ్యారు. చివరి సంవత్సరానికి ఈ పథకానికి డబ్బులు ఇవ్వలేదు.

సంవత్సరం	విద్యార్థులు	అర్హులైన తల్లులు	నగదు జమైన వారిసంఖ్య
2019-20	2,81,424	2,42,672	1,49,727
2020-21	2,67,639	2,30,672	1,43,643
2021-22	2,74,088	1,65,382	1,53,345
2022-23	2,44,706	1,62,477	1,52,542

- తొలి ఏడాది 2,81,424 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో చదువుతుండగా, వీరికి 2,42,672 మంది తల్లులు ఉన్నట్లు గుర్తించారు. చివరకు 1,49,727 తల్లుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే తొలి ఏడాది రూ.15 వేలు చొప్పున నగదు జమచేశారు. తొలి ఏడాదే 92,945 మంది తల్లులలకు డబ్బులు రాలేదు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు.. అప్పట్లో విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులను ప్రశ్నిస్తే వీరంతా ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించినట్లు తెలిపారు.
- 2020-21లో 2,67,639 విద్యార్థులకు సంబంధించి 2,30,672 తల్లులను గుర్తించగా, చివరకు 1,43,643 మంది తల్లుల ఖాతాల్లో నగదు జమచేశారు. ఈ ఏడాదిలో అమ్మఒడికి దూరమైన వారిలో 87,029 మంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే వారితో పాటు బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేని వారున్నారని అధికారులు సమాధానం ఇచ్చారు.
- 2021-22లో 2,74,088 మంది విద్యార్థులకు 1,65,382 మంది తల్లులను అమ్మఒడికి అర్హులుగా గుర్తించారు. వీరిలోనూ 1,53,345 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే నగదు జమచేశారు. ఆ ఏడాదిలో 12,037 ఖాతాల్లో డబ్బులు పడలేదు.
- 2022-23లో 2,44,706 మంది విద్యార్థులకు 1,62,477 మంది తల్లులను గుర్తించగా, 1,52,542 మంది బ్యాంకు ఖాతాల్లో నగదు జమైంది. 9935 మంది తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు.

చివరి రెండేళ్లలో..

ఇలా, చివరి రెండేళ్లలో 21,972 మందికి అమ్మ ఒడి డబ్బులు రాలేదు. దీనిపై వారు విద్యార్థుల తల్లిదండ్రులు.. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని అడిగితే.. బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ లేదని, మీరు పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరచుకోమని సలహా ఇచ్చారు. బ్యాంకుల్లోని తమ ఖాతాలకు ఆధార్ లింక్ చేయాలని లబ్ధిదారులు బ్యాంకు సిబ్బందిని కోరగా.. అన్నీ సరిగ్గా ఉన్నాయని వారు జవాబిచ్చారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వివిధ కారణాలతో తమను ఉద్దేశపూర్వకంగానే అమ్మఒడి పథకానికి దూరం చేశారని భావించిన లబ్ధిదారులు పోస్టాఫీసుల్లో కొత్త బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి చూపలేదు. ఇలా జగన్ ప్రభుత్వం ఏటా దశలవారీగా వేలాది మంది లబ్ధిదారులకు అమ్మఒడిని దూరం చేసింది.

నిబంధనల పేరిట కోతలు...

అమ్మఒడికి జగన్ ఆంక్షలు పెట్టారు. తొలుత ఒక బిడ్డకే పథకాన్ని పరిమితం చేశారు. ఆ తర్వాత చాలా మంది ఆధార్‌కార్డు ఈకేవైసీ చేయకపోవడం, విద్యార్థుల హాజరు శాతాన్ని తెరపైకి తెచ్చారు. అనంతరం ఇంట్లో విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించరాదన్నారు. సాగుభూమి, ఇతర కారణాలతో వేలాది మందిని అనర్హులుగా చేర్చారు. కొన్ని పాఠశాలల్లో అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆధార్ కార్డు సక్రమంగా లేదంటూ బ్యాంకుల్లో నగదు జమ చేయలేదు. పైగా జనవరిలో ఇచ్చే అమ్మఒడి జూన్ నెలకు మారడంతో ఒక విద్యాసంవత్సరం మిస్ అయింది. ఇక, పర్యవేక్షణ విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారుల నుంచి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల చేతికి వెళ్లింది.


రూ.15 వేల నుంచి రూ.13 వేలకు

అమ్మఒడి పథకం కింద ప్రతి విద్యార్థికి వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు జమచేస్తానని జగన్ చెప్పారు. తొలి ఏడాది జనవరిలో రూ.15 వేలు జమచేశారు. ఆ తర్వాత పాఠశాల మరుగుదొడ్డి నిర్వహణ పేరుతో ప్రతి తల్లి రూ.వెయ్యి ఇవ్వాలని చెప్పారు. కొందరు మాత్రమే ఇచ్చారు. దీంతో 2021-22 నుంచి ప్రభుత్వమే రూ.వెయ్యి మినహాయించి రూ.14 వేలనే ఖాతాల్లో జమచేసింది. ఆ తర్వాత మరో రూ.వెయ్యి కోతపెట్టి రూ.రూ.13 వేలే ఇస్తోంది.

టీడీపీ వస్తే అందరికీ 'తల్లికి వందనం'

2024లో టీడీపీ అధికారంలోకి రాగానే.. ఒకే ఇంట్లో ఎంత మంది బిడ్డలు బడికి వెళతారో వారందరికీ 'తల్లికి వందనం' పేరుతో ఏటా రూ.15 వేలు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు. ఈ మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. దీంతో 'అమ్మఒడి'కి దూరమైన 80,195 మందికీ 'తల్లి వందనం' లభించనుంది.

- రెండు నెలలైనా తల్లుల ఖాతాల్లో జమకాని 'విద్యాదీవెన' డబ్బులు
- విద్యార్థులపై కళాశాల యాజమాన్యం ఒత్తిడి
- అప్పుచేసి ఫీజులు కడుతున్న తల్లిదండ్రులు



పేద బిడ్డల ఉన్నత చదువుకు నేను బటన్ నొక్కుతున్నా, ఇక్కడ్నుంచి నే....రుగా పిల్లలు, తల్లుల జాయింట్ అకౌంట్‌కే డబ్బులు చేరతాయి.

- కృష్ణాజిల్లా పామర్రులో మార్చి ఒకటో తేదీన బటన్ నొక్కి విద్యాదీవెన నిధులను విడుదల చేసిన సందర్భంగా సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ మాట చెప్పారు.

వాస్తవం: రెండు నెలలు దాటినా రూపాయి కూడా జమకాలేదు. పామర్రు నుంచి నే...రుగా డబ్బులు రావడానికి మధ్యలో ఆటంకాలేమైనా ఉన్నాయా అంటూ విద్యార్థుల తల్లులు మండిపడుతున్నారు.

డిసెంబరులో బటను నొక్కినా: మార్చి నెలే కాదు.. భీమవరంలో గతేడాది డిసెంబరులో నొక్కిన బటనుకూ మూడో వంతు మందికి ఇంకా డబ్బులు జమకాలేదు. అయినా, తాను పేద బిడ్డల పెద్ద చదువులకు కృషి చేస్తున్నానని, ఈ క్రమంలో విపక్షాలతో యుద్ధం చేయాల్సి వస్తోందంటూ ఆ సభల్లో చెప్పడం సీఎం జగన్‌కే చెల్లింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు టీడీపీ హయాంలో ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు.. ప్రస్తుత ప్రభుత్వం 'జగనన్న విద్యాదీవెన' అని పేరు మార్చింది. ఇంటర్ వరకు అమ్మఒడి పథకంలో చేర్చడంతో ఆపై డిగ్రీ, పీజీ, డిప్లొమా ఇతర కోర్సులు చదువుకున్న విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకాన్ని అందిస్తున్నారు. ప్రతి త్రైమాసానికి ఒకసారి సభలు పెట్టి సీఎం జగన్ బటన్ నొక్కుతున్నారు. ప్రతిసారి ఈ పథకం కోసం ప్రభుత్వ నిధులతో ప్రకటనలు ఇస్తున్నారు. ఆ సభల్లో రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. కానీ, విద్యా, వసతి దీవెన డబ్బులు మాత్రం తల్లుల ఖాతాల్లో సకాలంలో జమ కావడంలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 324 కళాశాలల్లో సుమారు 40వేల మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం డిసెంబరు 28వ తేదీన సీఎం జగన్ భీమవరం సభలో బటన్ నొక్కారు. ఆ బటన్ సరిగా పనిచేయలేదేమో కానీ.. ఉమ్మడి జిల్లాకు రూ.31.54 కోట్లకు గాను రూ.20.54 కోట్లే తల్లుల ఖాతాల్లో జమయ్యాయి. నాలుగు నెలలు దాటినా రూ.11 కోట్లు ఇంకా జమ కాలేదు. అలాగే, మార్చి ఒకటిన నొక్కింది 'ఉత్తుత్తి బటన్'లాగా ఉంది. ఎందుకంటే ఆ త్రైమాసానికి సంబంధించి ఇంకా రూ.29.4 కోట్లు జమ కానే లేదు. ఇప్పుడు ఎన్నికలు కూడా వచ్చేశాయి. ఇప్పట్లో ఈ నిధులు జమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

ఆందోళనలో విద్యార్థులు

ఏడాదికి నాలుగుసార్లు విద్యాదీవెన కింద డబ్బులను విడుదల చేస్తారు. గతేడాదికి సంబంధించి ఒక్క విడత ఫీజు మాత్రమే అందింది. అదీ చాలా మందికి రాలేదు. మిగిలిన మూడు విడదల ఫీజులు రావాల్సి ఉంది. ఫీజుల విడుదల విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో ఈ విద్యా సంవత్సరం కూడా దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఎన్నికల హడావుడిలో అందరూ ఉన్న దృష్ట్యా విద్యాదీవెన వస్తుందా.. రాదా అన్న అనుమానం విద్యార్థుల్లో నెలకొంది.

టీడీపీ హయాంలో కళాశాలల ఖాతాలకే

గత టీడీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా కళాశాలలకే విడుదల చేసేవారు. దీనికోసం ప్రతిసారి రూ.కోట్లు ఖర్చుచేసి మీటింగులు పెట్టడం.. పేజీల కొద్దీ ప్రకటనలు ఇచ్చేవారు కాదు. ఒకవేళ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఆలస్యమైనా సంబంధిత శాఖల అధికారులే నేరుగా కళాశాల నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూసేవారు. ఫీజులు కట్టాలని ఒత్తిడి చేసే కళాశాలలకు ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీశాఖల అధికారులే ఫీజులకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని హామీ పత్రాన్ని ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తోంది. ఇప్పుడిలా డబ్బులు జమ కాకపోవడంతో సకాలంలో కళాశాలలకు కట్టలేని పరిస్థితి. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. చదువు పూర్తయిన వారికి పెండింగ్ ఫీజులను చెల్లిస్తేనే సర్టిఫికెట్లను ఇస్తామని స్పష్టం చేస్తున్నాయి. కళాశాలల్లో చదువుతున్న వారికి ఫీజులు కడితేనే తరగతులకు అనుమతిస్తామంటున్నాయి. ఆర్థిక స్థోమత కలిగిన వారు ముందుగానే ఫీజులను కడుతుండగా పేదలు వడ్డీకి అప్పులు చేసి ఫీజు కడుతున్నారు.

దీనికేమీ అడ్డంకులు లేవు కదా

కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసి వలంటీర్లను పక్కన పెట్టించింది. అందువల్ల సకాలంలో అవ్వా తాతలకు పింఛన్లను ఇవ్వలేకపోయామంటూ అధికార పార్టీ నేతలు ఏప్రిల్‌లో ప్రచారం చేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయించే ప్రత్యామ్నాయం ఉన్నప్పటికీ వృద్ధులను ఇబ్బంది పెట్టారు. మరి, విద్యాదీవెన నిధులకు వలంటీర్ల అవసరం లేదు కదా.నే..రుగా తల్లులు, పిల్లల జాయింట్ అకౌంట్‌లో ఆ డబ్బులు ఎందుకు జమ చేయలేదనే దానికి అధికార పార్టీ నేతల నుంచి సమాధానం లేదు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నమ్మి.. అప్పులపాలై..!

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుందని నమ్మి నిరుపేదలైన తల్లిదండ్రులు తమ పిల్లలను పెద్ద చదువులకు చేర్పించారు. తీరా ప్రభుత్వం సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పులపాలయ్యారు.

- చిత్తూరులోని చాకలవీధికి చెందిన తరుణ్ నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడి తండ్రి డ్రైవరు. కాలేజీ నిర్వాహకులు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేశారు. విద్యాదీవెన పథకం కింద డబ్బులు జమ కాలేదని చెప్పినా వారు వినిపించుకోలేదు. దాంతో అప్పులు చేసి కాలేజీ ఫీజులు చెల్లించారు. కుటుంబం గడవటమే కష్టంగా ఉన్న తమకు.. ఈ అప్పు భారంగా మారిందని తరుణ్ తండ్రి వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.
- యాదమరికి చెందిన సంజయ్ తిరుపతిలో పాలిటెక్నిక్ చదువుతున్నాడు. గతేడాది ఫీజునే ప్రభుత్వం చెల్లించలేదు. కాలేజీ నిర్వాహకుల ఒత్తిడిమేరకు అప్పులు చేసి ఫీజులు కట్టారు. ఇప్పుడు తీసుకన్న వడ్డీలు కడుతున్నారు.

- చిత్తూరు

● 'పూజా'కాలం

దేవుళ్లకు మంచిరోజులు!

కొండకోనల్లో గమ్మున తమమానాన తాము ఉంటున్న దేవుళ్లకు మంచిరోజులు వచ్చేశాయి. గుళ్లు గోపురాలు రాజకీయ జనాలతో కళకళలాడుతున్నాయి. మానవ ప్రయత్నంతో పాటు దైవ ప్రయత్నమూ తోడవ్వాలన్నది భారతీయ సంప్రదాయం. ఎంత కష్టపడినా ఫలితం అనుకూలంగా ఉండాలంటే దైవబలం తోడవ్వాలన్నది మనకున్న నమ్మకం. ఈ సంప్రయాలనూ, నమ్మకాలనూ తూచా తప్పకుండా పాటించేది రాజకీయాలలోనే. మరీ ఎన్నికలొచ్చాయంటే చాలు.. గుడులు, గోపురాలు తిరగడం, తమను లేదా తాము అభిమానించే నాయకుడిని గెలిపించాలని భక్తిగా దేవతలకు మొక్కడం రాజకీయ నాయకులకు ఆనవాయితీ. ఎన్నికలు పట్టుమని పదిరోజులు కూడా లేవిక. అందుకే హడావుడి తీవ్రమైపోయింది. ఒకవైపు ప్రచారాలను ఉధృతం చేస్తూనే, వీలు కల్పించుకుని ఆలయాలనూ సందర్శించేస్తున్నారు నాయకులు. కోరిన కోరిక తీరుస్తాడని స్థానికంగా నమ్మకం బాగా ఉన్న దేవతలను వెదకి మరీ, కొండకోనల్లో ఉన్నా సరే మండే ఎండలను లెక్క చేయకుండా నడిచే వెళ్లిపోతున్నారు. మనసారా మొక్కి 'విజయాన్ని అందించు సామీ' అని వేడుకుంటున్నారు. అలా టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అనుచరగణంతో పైపాళ్యం పంచాయతీ కూసూరులో కొండ కోనల నడుమ కొలువైన సుబ్రహ్మణ్యస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. 'అధినేత చంద్రబాబు నాయుడును లక్ష ఓట్ల మెజారిటీతో అఖండ విజయాన్ని అందించు స్వామీ' అంటూ మొక్కుకున్నారు.

- కుప్పం



కూసూరు దేవాలయంలో సురేశ్‌బాబు పూజలు

రెండు రోజుల కిందట చంద్రమాకులపల్లె సచివాలయం వద్ద 'పార్టీ' సందడి



మందు 'పార్టీ'లు

పోలింగ్ తేది దగ్గరపడే కొద్దీ పుంగనూరులో మందు 'పార్టీలు' ఎక్కువవుతున్నాయి. దీనికోసం గ్రామ సచివాలయాన్నే వేదికగా మార్చేశారు కొందరు వైసీపీ నేతలు. రెండురోజుల కిందట పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె గ్రామంలో వైసీపీ నాయకులు ప్రచారం పూర్తి చేసుకున్నారు. ఆ రాత్రికి గ్రామసచివాలయం వద్దే ప్రచారంలో పాల్గొన్న వారికి మందు బాటిళ్లు, బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈవిషయంపై టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది కూడా. ఇక పార్టీ క్యాడర్‌కు ప్రతి రాత్రి మందు, విందే. ఇలా నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో మందు, విందు పార్టీలు జోరుగా సాగుతున్నాయి.

- పుంగనూరు

● నోట్ దిస్ పాయింట్



- ఓటరు గుర్తింపుకార్డును 1993లో అప్పటి ఎన్నికల ప్రధాన కమిషనరు టి.ఎన్.శేషన్ ప్రవేశ పెట్టారు. అక్కడ్నుంచి ఇప్పుడు ఎపిక్ ఓటరు కార్డుల వరకు వచ్చింది.
- 2011 జనవరి 25న మొట్టమొదటిసారిగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.
- భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25న ఏర్పాటైంది. అప్పటినుంచి జిల్లాస్థాయిలో జిల్లా ముఖ్య ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు.

- చిత్తూరు కలెక్టరేట్

● చిత్తూరు పార్లమెంటు చరిత్ర

టీడీపీ కంచుకోట

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక చిత్తూరు పార్లమెంటుకు 10 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడు సార్లు టీడీపీ గెలిచింది. చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం అసెంబ్లీ స్థానంలో అత్యధికంగా మెజార్టీ వస్తుండడం.. చిత్తూరు లోక్‌సభలో టీడీపీ అభ్యర్థి విజయానికి కలిసొచ్చే అవకాశం. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఈ స్థానం ఎస్సీలకు రిజర్వు అయింది. చిత్తూరు తొలి ఎంపీగా 1952-57 మధ్యకాలంలో టీఎన్ విశ్వనాథరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఎస్సీలకు రిజర్వు అయ్యాక తొలిసారి 2009లో టీడీపీ నుంచి నటుడు, దర్శకుడు ఎన్.శివప్రసాద్ ఎంపీగా గెలుపొందారు.

పదవీ కాలం	ఎంపీ పేరు	పార్టీ
1952-57	టీఎన్ విశ్వనాథరెడ్డి	కాంగ్రెస్
1957-62	ఎంఏ అయ్యంగార్	కాంగ్రెస్
1962-67	ఎన్‌జీ రంగా	స్వతంత్ర పార్టీ
1967-71	ఎన్‌పీసీ నాయుడు	కాంగ్రెస్
1971-77	పి.నరసింహారెడ్డి	కాంగ్రెస్
1977-80	పి.రాజగోపాలనాయుడు	కాంగ్రెస్
1980-84	పి.రాజగోపాలనాయుడు	కాంగ్రెస్
1984-89	ఎన్‌పీ ఝాన్సీలక్ష్మి	టీడీపీ
1989-91	జ్ఞానేంద్రరెడ్డి	కాంగ్రెస్
1991-96	జ్ఞానేంద్రరెడ్డి	కాంగ్రెస్
1996-98	రామకృష్ణారెడ్డి	టీడీపీ
1998-99	రామకృష్ణారెడ్డి	టీడీపీ
1999-2004	రామకృష్ణారెడ్డి	టీడీపీ
2004-09	డీకే ఆదికేశవులు	టీడీపీ
2009-14	శివప్రసాద్	టీడీపీ
2014-19	శివప్రసాద్	టీడీపీ
2019-24	ఎన్ రెడ్డెప్ప	వైసీపీ



విశేషాలు

- గుంటూరు జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు నాయకుడు ఆచార్య ఎన్జీ రంగాను చిత్తూరు లోక్‌సభ ప్రజలు ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపించారు. నెహ్రూ విధానాలను వ్యతిరేకించి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన ఆయన స్వతంత్ర పార్టీని స్థాపించి 1962 ఎన్నికల్లో చిత్తూరు ఎంపీగా పోటీ చేసి గెలిచారు.
- నూతనకాల్వ రామకృష్ణారెడ్డి 1996, 98, 99 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి మూడుసార్లు గెలుపొందారు. హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది ఈయన ఒక్కరే. ఈయన మాజీ మంత్రి అమరనాథరెడ్డి తండ్రి.

అసెంబ్లీ నియోజక వర్గాలు

కుప్పం, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, చంద్రగిరి

- చంద్రగిరి పూర్తిగా, నగరి సెగ్మెంట్‌లోని పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలో ఉన్నాయి.
- చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం రాజంపేట పార్లమెంటు పరిధిలో ఉంది.

శ్రీకాళహస్తి
సత్యవేడు

సత్యవేడును అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారు
మాజీ మంత్రి ఆలపాటి రాజా


మీడియాతో మాట్లాడుతున్న ఆలపాటి రాజా

సత్యవేడు, మే 3: సత్యవేడు నియోజకవర్గాన్ని వైసీపీ నేతలు అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజా విమర్శించారు. శుక్రవారం సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించిన ఆయన ఎన్నికల ప్రచార సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల అవినీతి పాలన పట్ల ప్రజలు విసిగిపోయి ఉన్నారని తెలిపారు. సీఎం జగన్ అసమర్థ పాలనతో అన్ని రంగాలు కుంటుపడ్డాయన్నారు. ప్రత్యేకించి వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. యువతను మత్తు పదార్థాలకు బానిసగా చేసి వారి జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. సత్యవేడు నియోజకవర్గంలో సహజ వనరులైన గ్రావెల్, ఇసుక, కంకర తమిళనాడుకు తరలించి వేల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించి మళ్లీ ఎన్నికల్లో గెలుపొందాలని ప్రయత్నాలు సాగిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 13 తేదీ ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసేందుకు ప్రజలు కసిగా ఉన్నారని, నిశ్శబ్ద విప్లవంతో టీడీపీకి చారిత్రాత్మక గెలుపును అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

ఘనంగా ఎస్సీవీ నాయుడి జన్మదిన వేడుకలు


ఎస్సీవీ నాయుడిని సత్కరిస్తున్న సత్రవాడ ప్రవీణ్ తదితరులు

శ్రీకాళహస్తి, మే 3: టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఆయన స్వగృహంలో పలువురు కలిసి సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్ నాయుడు, మాజీ శాప్ మాజీ చైర్మన్ పీఆర్ మోహన్ సతీమణి ఇందిరా తదితరులు శేషవస్త్రం, గజమాలతో సత్కరించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, తిరుపతి నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ఆయన అభిమానులు అనుచరులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని పలుచోట్ల పేదలకు అన్నదాన కార్యక్రమాలు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం: ఆదిమూలం


రాచపాళెంలో ఆదిమూలం ప్రచారం

సత్యవేడు, మే 3: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం చేసి చంద్రన్న ప్రజారంజక పాలనకు స్వాగతం పలుకుదామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాచపాళెం, చిన్న ఈటిపాకం, కొత్త మారికుప్పం, అమావాస రెడ్డి కండ్రిగ, ఎన్ఆర్ అగ్రహారం, కన్నవరం, అల్లప్పగుంట, జడేరి గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు లావణ్యకుమార్, మండల అధ్యక్షుడు రూపేష్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి మునికృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

అంజిమేడులో గుర్తుతెలియని మృతదేహం

ఏర్పేడు, మే 3: ఏర్పేడు మండలం అంజిమేడు వద్ద ఉన్న అటవీప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి వయసు 40 సంవత్సరాల లోపు ఉంటుందని, ఎర్ర టీషర్టు, నల్లప్యాంటు ధరించి ఉన్నట్లు ఎస్ఐ జిలానీ తెలిపారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు సంప్రదించాలని చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాల అప్పగింత

ఏర్పేడు, మే 3: ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద జాతీయ రహదారిపై తమిళనాడు ఆర్టీసీ బస్సు, కారును ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మురగన్, లలిత్‌కుమార్‌సింఘాల్, అంజు సింఘాల్ మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలకు శుక్రవారం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. లలిత్‌కుమార్‌సింఘాల్, అంజు సింఘాల్ మృతదేహాలను ముంబాయికి, డ్రైవర్ మురుగన్ మృతదేహాన్ని చెన్నైకు తరలించారు.

వైసీపీ ప్రచారంలో పంచాయతీ ఒప్పంద కార్మికుడు


వైసీపీ ప్రచారంలో పంచాయతీ ఒప్పంద కార్మికుడు మురళి

రేణిగుంట, మే 3: రేణిగుంట పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికుడు మురళి వైసీపీ ప్రచారంలో పాల్గొన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పెద్దమసీదు వీధి వద్ద మసీదులో ప్రార్థనలు ముగించుకుని బయటకువచ్చిన ముస్లింలకు స్థానిక వైసీపీ నేతలు కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఒప్పంద కార్మికుడు మురళి కూడా పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, మే 3: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామాలు పఠించారు.

తహసీల్దారు కార్యాలయ భవనం ప్రారంభం

వరదయ్యపాళెం, మే 3: వరదయ్యపాళెం తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో సీసీఎల్ కంపెనీ రూ.17లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు భవనాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని కువ్వాకొల్లిలో గల సీసీఎల్ కాంటినెంట్ కాఫీ పరిశ్రమ ప్రతినిధులు, చైతన్య, కృష్ణకిషోర్, తహసీల్దారు ఉదయభారతి నూతన భవనాన్ని ప్రారంభించారు. కాంట్రాక్టరు శివ, ఆర్ఐ వేణుగోపాల్, సర్వేయర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ముక్కంటికి ధారా పాత్ర

శ్రీకాళహస్తి, మే 3: శ్రీకాళహస్తీశ్వర స్వామిపై శనివారం నుంచి ధారా పాత్ర ఏర్పాటు చేయనున్నారు. క్రోధి నామ సంవత్సర చైత్ర బహుళ ఏకాదశి శనివారం రోజున మధ్యాహ్నం 12:35 నిమిషాలకు డొల్లు కర్తరి మాసం ప్రారంభం కానుంది. వేసవి తీవ్రత నుంచి పరమేశ్వరుడికి ఉపశమనం కల్పించేలా ధారా పాత్ర ఏర్పాటు చేయడం ఆలయ సంప్రదాయం. ఇందులో భాగంగా శనివారం ఉదయం రెండవ కాల అభిషేకం పూర్తయిన తర్వాత మూలమూర్తిపై ధారా పాత్ర వేదోక్తంగా నెలకొల్పనున్నారు. ఆ తర్వాత 11వ తేదీ వైశాఖ మాసం శనివారం రోజు రాత్రి 10:21 నిమిషాల నుంచి నిజ కర్తరి ప్రారంభం కానుంది. ఈనెల 28వ తేదీన మంగళవారం రాత్రి 7:23 నిమిషాలకు కర్తరి సమాప్తం కానుంది. అప్పటివరకు గంగాధరుడికి ధారాపాత్రతో అభిషేకం కొనసాగనుంది.

18నుంచి చెన్నకేశవస్వామి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, మే 3: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా మండలంలోని ఊరందురులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు 18 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఈవో నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

వైసీపీ పాలనతో రాష్ట్రం అధోగతి: సుధీర్ రెడ్డి


అమ్మపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 3: వైసీపీ పాలనతో రాష్ట్రం అధోగతి పాలయిందని ఎన్డీఏ కూటమి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాలెం, పుల్లారెడ్డి కండ్రిగ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమ్మపాలెం గ్రామస్తులు రాఘవరెడ్డి, రమణారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం సుధీర్ రెడ్డి ఇంటింటికి వెళ్లి వైసీపీ విధానాలతో రైతులు, మహిళలకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అమలు చేయబోయే సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టేసాయి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 32 వార్డు దర్గామిట్ట ప్రాంతానికి చెందిన బిల్డర్ అమీర్ భాష తన అనుచరులతో కలిసి సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళ్లెం, పుల్లారెడ్డి కండ్రిగ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కందాటి రాఘవరెడ్డి, సుబ్బరామిరెడ్డి, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, కొట్టేసాయి తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని గోల్లపల్లి పంచాయతీ బీవీపురం, ఎస్సీ ఎస్టీకాలనీలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఎన్డీఏ కూటమి ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని ఊరందూరులోని ఆయన నివాసంలో తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. వారికి సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

రేణిగుంట: మండలంలోని గుండ్రాళ్లకాలువ, సీఆఆర్ నగర్, చైతన్యపురం గ్రామాలకు చెందిన పాండు, నాగేశ్వరరావు, బాలాజీ నేతృత్వంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు రేణిగుంట పట్టణంలోని పెద్దమసీదు వద్ద ముస్లింలకు కరపత్రాలు పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డిని, కమలం గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బుజ్జినాయుడు, పాడి రాజేంద్ర, ఎంజీరెడ్డి, పవన్, మెహబూబ్‌బాషా, మునీర్,పుష్పనాథన్, నవాబ్, కన్నన్‌రెడ్డి, రవి, సుబ్రహ్మణ్యం, సుధా, ముని, దినేష్ పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో బొజ్జల బృందమ్మ

శ్రీవారి ఆశీస్సులతో విజయం నాదే: వరప్రసాద రావు


బీసీ సంఘ నాయకులతో మాట్లాడుతున్న వరప్రసాదరావు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 3: తిరుమల వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తిరుపతి ఎంపీగా మరోసారి తాను విజయం సాధించబోతున్నానని బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం తిరుమలతో శ్రీవారిని ఆయన కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి నగరంలోని పీకే లేఅవుట్‌లో బీసీ సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన పాలుపంచుకున్నారు. జీవకోన లోని ముస్లిం సోదరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తాను ఎప్పుడు అందు బాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, వరప్రసాద్ సతీమణి కొల్లారి లక్ష్మీ, కుమారుడు నవీన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులతో సమావేశమైన వరప్రసాదరావు - తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం కుటుంబ సభ్యులతో

బలిజ ఆత్మీయ సభకు విచ్చేయండి



మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌తో పల్లమాల సుధాకర్

శ్రీకాళహస్తి, మే 3: బలిజ ఆత్మీయ సభకు విచ్చేసి తమ సామాజిక వర్గ ఐక్యతను చాటుకుందామని మొగలిరేకులు సీరియల్ నిర్మాత, టీడీపీ నాయకుడు పలమాల సుధాకర్ పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. ఎన్డీఏ కూటమి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ గెలుపు కోసం సుధాకర్ విస్తృతంగా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని మహేష్ కల్యాణ మండపంలో ఈనెల ఐదవ తేదీన బలిజ ఆత్మీయ సభను నిర్వహించనున్నారు. శుక్రవారం తిరుపతిలో జనసేన రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్‌ను కలిసి ఆత్మీయ సభకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, పగడాల సుధాకర్, సుబ్బారావు, బీజే ప్రసాద్, పలమాల శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు


స్వర్ణ కవచ అలంకారంలో దక్షిణ కాళికాదేవి

శ్రీకాళహస్తి, మే 3: మండలంలోని వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కలిగించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వలంటీర్ల రాజీనామా

వరదయ్యపాళెం, మే 3: మండలంలోని ముస్లింపాళెం, రాచర్ల, మరదవాడ, తొండంబట్టు, కదూరు, మత్తేరిమిట్ట, వరదయ్యపాళెం సచివాలయాల పరిధిలోని వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

వైసీపీ నియంతృత్వ పాలనకు స్వస్తి పలుకుదాం
చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ - హాజరైన ప్రజలు

చిత్తూరు సిటీ, మే 3: వైసీపీ నియంతృత్వ పాలనకు స్వస్తిపలికే సమయం ఆసన్నమైందని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని 17, 18, 19, 25 డివిజన్లలో ప్రజాగళం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న రాక్షసుడు సీఎం జగన్ రెడ్డి అన్నారు. భూకబ్జాలు, అక్రమ దందాలు, ఎర్రచందనం స్మగ్లర్లు, దళితుల హత్యలు, మహిళలపై దాడులు చేయించే నేతలకే వైసీపీ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించి అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగులు తీయించే సత్తా ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడన్నారు. ప్రజలందరూ అలోచించి రాక్షసుడు కావాలో.. శ్రామికుడు కావాలో నిర్ణయించుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే నగరంలోని ప్రధాన సమస్యలైన మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గురజాల సందీప్, పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, నేతలు ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, వరలక్ష్మి, కంద, గోపి, చలపతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

భాష్యకార్ల ఉత్సవాలు ప్రారంభం



నారాయణవనం, మే 3: పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో పదిరోజుల పాటు నిర్వహించే భాష్యకార్ల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం భాష్యకార్లు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు. తొమ్మిది రోజుల పాటు భాష్యకార్లు ఊరేగింపు, చివరిరోజు ఉభయ నాంచారుల సమేతుడైన కల్యాణ వెంకన్న భాష్యకార్ల ఊరేగింపు నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు తెలిపారు.

టీడీపీలో చేరికలు

వడమాలపేట, మే 3: వడమాలపేట మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, వడమాల మాజీ సర్పంచు గామిడి చలపతి యాదవ్ తన అనుచరులతో టీడీపీలో చేరారు. వారికి గాలి భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి చిన బాబు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి దాముయాదవ్, నాయకులు ఉదయ్ యాదవ్, నాగరాజు, రాధాకృష్ణమ్మ రాజు, చైతన్య వినోద్, వెంకటసుబ్బయ్య, జయదేవరాజు, చంద్రరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌చంద్రప్రసాద్‌కు పరామర్శ

నగరి: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘ యూనియన్ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్‌చంద్ర ప్రసాద్‌ను శుక్రవారం నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాస్ పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను నింద్ర మండలంలోని ఒరూరుపేటలోని స్వగృహంలో కలిసి పరామర్శించారు.



టీడీపీలో చేరిన చలపతితో భానుప్రకాష్ - రమేష్‌చంద్రప్రసాద్‌ను పరామర్శిస్తూ...

‘పోస్టల్ బ్యాలెట్’ కీ మాస్టర్ డీటీ అశోక్ రెడ్డి

జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3: తిరుపతిలో 16వేల మంది ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వైసీపీకి అనుకూలంగా మారుస్తున్న కీ మాస్టర్ డీటీ అశోక్ రెడ్డి అని జనసేన నాయకుడు కిరణ్ రాయల్ ఆరోపించారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అశోక్‌రెడ్డిపై గతంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయని గుర్తుచేశారు. తొలుత రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ, డీజీపీలను మారిస్తే అన్నీ సర్దుకుంటాయని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. పది రోజుల్లో ఎన్నికలు ఉండగా టీడీపీ, జనసేన నాయకులను బైండోవర్ చేసుకుని.. వైసీపీ నాయకులు రిగ్గింగ్ చేసుకోవడానికి అవకాశం



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్ రాయల్

కల్పించినట్టు అవుతుందని స్పష్టం చేశారు. తిరుపతిలో వైసీపీకి ఓటమి భయం పట్టుకున్నట్టు కనిపిస్తోందన్నారు. అధికారులు ఇకనైనా వైసీపీ భజన ఆపకుంటే కూటమి గెలిచాక చట్టబద్ధ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముద్రగడ పద్మనాభం గురించి సొంత కూతురు చేసిన వ్యాఖ్యలు ఆయన్ను చెప్పుతో కొట్టినట్టుగా ఉన్నాయన్నారు. తిరుపతి ఎన్నికల పరిశీలకులు అత్తిగారి కృష్ణ, కూరగాయల లక్ష్మీపతి మాట్లాడుతూ.. పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను ఎన్నికల్లో ఎదుర్కోలేక కె.పవన్ కల్యాణ్ అనే మరో వ్యక్తితో వైసీపీ నాయకులు నామినేషన్ వేయించారని మండిపడ్డారు. చట్టబద్ధంగా తిరుపతిలో ఎన్నికలు నిర్వహిస్తే కూటమి అభ్యర్థులే ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డికి ఓటేస్తే చిత్తూరులో రౌడీ రాజ్యం

● దళిత నేత పున్నాక సురేష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3: విజయానందరెడ్డికి ఓటు వేస్తే చిత్తూరులో రౌడీ రాజ్యం వస్తుందని దళిత సంఘం



విలేకరులతో మాట్లాడుతున్న దళిత నేత పున్నాక సురేష్

నేత పున్నాక సురేష్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అనుచరులపై విజయానందరెడ్డి అనుచరులు దాడి చేయడం బాధాకరమన్నారు. దీనిని దళిత సంఘాలుగా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇలాంటి రౌడీయిజానికి చరమగీతం పాడాలంటే ఓటు ద్వారా విజయానందరెడ్డిని ఇంటికి సాగనంపాలని సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటాద్రి, వెంకటేష్, రవి, ప్రసాద్, ధనరాజ్, సునీల్, మోహన తదితరులు పాల్గొన్నారు.

ఓటు ద్వారా చెత్త ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపండి

టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ పిలుపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3: రాష్ట్రంలో చెత్తపై పన్ను వేసిన వైసీపీ చెత్త ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధిక ధరలతో ప్రజలపై తీవ్రమైన భారం వేసిందని ఆరోపించారు. తిరుపతిలో ప్రశాంత వాతావరణం ఏర్పడాలంటే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావుకు ఓటువేయాలని అభ్యర్థించారు. జనసేన అధికార ప్రతినిధి కీర్తన మాట్లాడుతూ.. ఆస్తి పన్ను విధింపులో వైసీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఆస్తి విలువను బట్టి పన్ను విధించడం తగదన్నారు. బీజేపీ నేత అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కూటమి గెలిస్తే ప్రజలకు పన్నుల నుంచీ ఊరట లభిస్తుందన్నారు.

అదరని, బెదరని కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత. ఒకరు 48వ డివిజన్‌కీ, మరొకరు 49వ డివిజన్‌కీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీసీల హక్కుల కోసం పోరాడే బలమైన నాయకుడిగా పేరున్న అన్నా రామచంద్రయ్య కుమార్తెలు వీరు. పెద్దమ్మాయి సంధ్య డాక్టర్. అనిత అమెరికాలో ఎంఎస్ చదువుకున్నారు. వైసీపీలో ఇమడలేక ఇటీవలే బయటకు వచ్చారు. అధికారపార్టీలో ఉన్నా కౌన్సిల్లో సమస్యలపై నిరసన స్వరం వినిపించే అన్నా సిస్టర్స్‌తో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ...



మేయర్‌ను స్టాంప్‌గా మార్చేశారు

యాదవ సామాజికవర్గం అవమానంతో రగిలిపోతోంది

వారి ఆటలు సాగవనే మేయర్ పదవి మాకివ్వలేదు

వైసీపీలో మమ్మల్ని వలంటీర్ల కన్నా ఘోరంగా చూశారు

కార్పొరేషన్ ఆఫీసు నుంచే అభినయ్ దందాలు, సెటిల్మెంట్లు సాగుతున్నాయి

అన్నా సిస్టర్స్ సంధ్య, అనిత

? వైసీపీని వదిలి ఎందుకు వచ్చేశారు.

అనిత: మాకు పార్టీలో న్యాయం జరగలేదన్నది ఒక్కటే కారణం కాదు. రాష్ట్ర పరిస్థితులు కూడా నచ్చలేదు. అంగుళం కూడా అభివృద్ధి లేదు. ఇవన్నీ ఆలోచించుకునే అక్కడ ఇమడలేక బయటకు వచ్చాం.

సంధ్య: మేయర్ ఇస్తామని నమ్మించారు. చివరకి వలంటీర్లకిచ్చిన కనీస గౌరవ, మర్యాదలు కూడా మాకు ఇవ్వలేదు. అలాంటి వాళ్ల దగ్గర ఉండాల్సిన అవసరం లేదనిపించింది.

? వైసీపీలో మీ అనుభవాలేమిటి.

అనిత: ప్రమాణ స్వీకారం రోజే మారిపోదామనిపించింది. డివిజన్ల అభివృద్ధి, మమ్మల్ని నమ్ముకున్న ప్రజల సంక్షేమం కోసం సహనంతో ఉండాల్సి వచ్చింది.

సంధ్య: అవకాశాలిస్తామని చెబితే ఆశపడడం మానవ సహజం. రెండోసారి మేయర్ పదవి ఇస్తామని సంకేతాలిచ్చినా మేం నమ్మలేదు.

? మీ సామాజికవర్గానికే కదా మేయర్ పదవి ఇచ్చారు.

అనిత : జనరల్ అయినప్పటికీ మేయర్ పదవి బీసీ యాదవ మహిళకు ఇవ్వడాన్ని అందరం స్వాగతించాం. అయితే మేయర్ స్థానంలో ఉన్న మహిళను డమ్మీని చేసి కూర్చోబెట్టారు. దీనిపై యాదవ సామాజికవర్గం కోపంతో రగిలిపోతోంది. మాకు మేయర్ ఇస్తే వాళ్ల ఆటలు ఇంతలా సాగవని వాళ్లకు తెలుసు.

సంధ్య : మేయర్‌కు సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా.. ఇలా అన్నివిధాలుగా బలం వుంది. అయితే డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి చేసే అక్రమాలకు ఆమె అధికారిక స్టాంప్‌గా మారారు. అజెండా అంశాలు కూడా మేయర్‌కు తెలియకుండా కౌన్సిల్లో చర్చకు వచ్చేస్తుంటాయి. భవిష్యత్తులో కౌన్సిల్ నిర్ణయాల్లో జరిగిన అక్రమాల విచారణలో మేయర్ ఇబ్బందిపడే అవకాశం లేకపోలేదు.

? డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి పాత్ర ఏంటి

అనిత : ముద్ర నారాయణ, అభినయ్ రెడ్డిలు ఇద్దరూ డిప్యూటీ మేయర్లే. కానీ అభినయ్‌రెడ్డి చుట్టూనే కౌన్సిల్ తిరుగుతుంటోంది. ఆయన పెట్టిన అజెండానే చర్చకు వస్తుంది. ఆయన చేసిన తీర్మానాలే ఆమోదం పొందుతాయి.

సంధ్య: కార్పొరేషన్ కార్యాలయానికి సమాంతరంగా అభినయరెడ్డి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని రాజా రెడ్డి పాలన చేశారు. దందాలు, సెటిల్మెంట్లు అన్నీ అక్కడనుంచే సాగాయి.

? కౌన్సిల్లో మీపార్టీకి బలం పెరిగితే మీఇద్దరిలో ఎవరు మేయర్ అవుతారు.

అనిత: ఎవరికి ఇచ్చినా కష్టపడి పనిచేస్తాం. మా సోదరి సంధ్యకి కార్పొరేషన్ ఎన్నికల్లో మెజారిటీలో రాష్ట్రంలోనే రెండో స్థానం లభించింది. ఇద్దరం చదువుకున్న వాళ్లం. మానాన్నకు గాడ్ ఫాదర్ లేరు. కమ్యూనిస్ట్ బ్యాక్‌గ్రౌండ్. చిన్నప్పటినుంచి కష్టపడ్డారు. మాకూ అవే నేర్పారు. పదవి లేకపోయినా ఎలావుండాలో తెలుసుకున్నాం.

సంధ్య రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రాబోతోంది. ఇక్కడ కౌన్సిల్ కూడా మారుతుంది. ఆ దిశగా పార్టీ అధిష్ఠానం కూడా ఆలోచించి నిర్ణయం తీసుకుంటుంది. పార్టీ నిర్ణయానికి బద్దులమై పనిచేస్తాం.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఫటాఫట్ !

దూరవిద్య పీజీ మొదటి సంవత్సర ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3: ఎస్వీయూ పరిధిలో గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన దూరవిద్యా పీజీ మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్ సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

‘ఉదయన’తో మహిళా వర్సిటీ ఎంవోయూ

● బోధన, పరిశోధనల్లో పరస్పర సహకారానికి ఒప్పందం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 3: ఇండోనేషియా దేశం బాలిలోని ఉదయన వర్సిటీతో పద్మావతి మహిళా యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల పద్మావతి వర్సిటీ వీసీ భారతి ఆ యూనివర్సిటీని సందర్శించి ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రకారం ఈ రెండు యూనివర్సిటీలు బోధన, పరిశోధన రంగాల్లో పరస్పరం సహకరించుకోనున్నాయి. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై ఇరు యూనివర్సిటీల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి వర్సిటీ వీసీ భారతి, వర్సిటీ ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్ విజయలక్ష్మి, బయో టెక్ హెడ్ జ్యోత్స్న, ఉదయన వర్సిటీ ప్రతినిధులు ఎన్గాకన్ పుతు, గెడె సుర్దానా పాల్గొన్నారు.

మూగ జీవాల నుంచి సంక్రమించే వ్యాధులపై పరిశోధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్

తిరుపతి(వైద్యం), మే 3: ప్రస్తుత రోజుల్లో మూగ జీవాల నుంచి అనేక కొత్త రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వీటిని గుర్తించి తగిన వైద్యం అందించే దిశగా ఎస్వీ వైద్య కళాశాల.. ఎస్వీ పశు వైద్య యూనివర్సిటీతో కలిసి పరిశోధనలు నిర్వహించడం గొప్ప విషయమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలోని వైద్య విభాగాధిపతులు, ఎస్వీ పశువైద్య అధ్యాపకులతో శుక్రవారం ఎస్వీ వైద్య కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం జరిగిన ఎంవోయూ ప్రకారం పశు వైద్య యూనివర్సిటీతో కలిసి పరిశోధనలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రతీ ఒక్కరూ భాగస్వాములై పరిశోధనలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ పశువైద్య కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రయ్య, రిజిస్ట్రార్ రవి, డీన్ బ్రహ్మయ్య, ఎస్వీ వైద్య కళాశాల వైద్య విభాగాధిపతులు సునీత, కిరీటి, సత్యనారాయణమూర్తి, చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి, రాజంపేట పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్ కుమార్‌రెడ్డి

● నోట్ దిస్ పాయింట్



● ఓటరు గుర్తింపుకార్డును 1993లో అప్పటి ఎన్నికల ప్రధాన కమిషనరు టి.ఎన్.శేషన్ ప్రవేశపెట్టారు. అక్కడ్నుంచి ఇప్పుడు ఎపిక్ ఓటరు కార్డుల వరకు వచ్చింది.

● 2011 జనవరి 25న మొట్ట మొదటిసారిగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 25న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

● భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25న ఏర్పాటైంది. అప్పటినుంచి జిల్లాస్థాయిలో జిల్లా ముఖ్య ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు.

– చిత్తూరు కలెక్టరేట్

శ్రీవారి ఆలయంలో తోపులాటతో ఇబ్బందులు

● ఆన్‌లైన్‌లో గదులు లభించడం లేదు
● కొండపై హోటళ్లలో అధిక ధరలు వసూలు చేస్తున్నారు
● డయల్ యువర్ టీటీడీ ఈవోలో భక్తులు

తిరుమల, మే 3 (ఆంధ్రజ్యోతి): ‘శ్రీవారి ఆలయంలో వెండివాకిలి నుంచి బంగారు వాకిలి వరకు తోపులాట ఎక్కువగా ఉంది. వృద్ధులు, చిన్నపిల్లలు, దివ్యాంగులు చాలా ఇబ్బంది పడుతున్నారు’ అంటూ శ్రీనివాస్(వరంగల్), మహేష్(లింగంపల్లి), నరసప్ప(బెంగుళూరు), సాయికృష్ణ(హైదరాబాద్) అనే భక్తులు ఈవో ధర్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈవో స్పందిస్తూ.. ఆలయంలో మహాద్వారం నుంచి బంగారు వాకిలి వరకు ఒకే క్యూలైన్ విధానంలో భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నామని, విజిలెన్స్, ఆలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చి భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిరుపతిలో శుక్రవారం ఉదయం జరిగిన డయల్ యువర్ టీటీడీ



భక్తులకు సమాధానాలిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

ఈవో కార్యక్రమంలో పలువురు భక్తులు తమ సమస్యలు, సందేహాలను ఈవో దృష్టికి తెచ్చారు.

అప్పన్న(వైజాగ్): తిరుమలలోని ప్రైవేట్ హోటళ్లలో అధిక రేట్లు వసూలు చేస్తున్నారని, అఖిలాండం వద్ద వీధివర్తకులు భక్తులను ఇబ్బంది పెడుతున్నారని, రూ.300 దర్శన టికెట్లు రద్దు చేసుకుంటే రీఫండ్ ఇచ్చే వెసులుబాటు కల్పించండి.

ఈవో: హోటళ్లలో ధరల నియంత్రణకు, వీధి వర్తకులను అదుపు చేయడంపై చర్యలు తీసుకుంటామన్నారు. రూ.300 దర్శన టికెట్ రద్దు చేసుకుంటే రీఫండ్ చేయడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు.

ఈశ్వర్(నంద్యాల), రవీంద్ర, రుచిత దేవి, లావణ్య(హైదరాబాద్), నాగేశ్వరరెడ్డి(వనపర్తి): శ్రీవారిసేవ కోటా ఆన్‌లైన్‌లో విడుదలైన వెంటనే అన్ని తేదీలు బ్లాక్‌అవుతున్నాయి. బఫరింగ్ అవుతుండటంతో మాలాంటి వారికి పారదర్శకత లోపించిందేమో అన్న అనుమానం వస్తోంది.

ఈవో: శ్రీవారిసేవ ఆన్‌లైన్ అప్లికేషన్ ఎంతో పారదర్శకతతో రూపొందించాం. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు.

సూర్య మహేష్(హైదరాబాద్): గదులు ఆన్‌లైన్‌లో దొరకడం లేదు.

ఈవో: తిరుమలలోని 7,500 గదుల్లో 50 శాతం ఆన్‌లైన్‌లోనే కేటాయిస్తున్నాం. ఆన్‌లైన్‌లో లభించని నేపథ్యంలో తిరుమలలో నేరుగా పొందవచ్చు.

టీటీడీ విద్యాసంస్థల్లో ఉత్తమ ఫలితాలు: ఈవో

ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టీటీడీ కళాశాలలు, ఉన్నతపాఠశాలలు 98 శాతం ఫలితాలను సాధించాయని ఈవో సంతోషం వ్యక్తం చేశారు. డయల్ యువర్ టీటీడీ కార్యక్రమానికి ముందు ఆయన మాట్లాడారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. దీనికి కృషి చేసిన జేఈవో, డీఈవో, ప్రిన్సిపాళ్లు, హెడ్‌మాస్టర్లు, ఇతర బోధనా సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇక, ఇటీవల తొలిసారిగా బెంగళూరుకు చెందిన కీర్తన అనే బాలిక 10,01,116 సార్లు గోవిందనామాలు రాసి శ్రీవారిని దర్శించుకుందన్నారు. ఈనెల 17 నుంచి 19 వరకు పద్మావతీ పరిణయోత్సవాలు, 22న వెంగమాంబ జయంతి జరగనుందని తెలిపారు.

జూన్1 నుంచి 5 వరకు హనుమత్‌జయంతి ఉత్సవాలు

తిరుమలలోని ఆకాశగంగ వద్ద బాలాంజనేయస్వామి ఆలయంలో జూన్1 నుంచి 5వ తేదీ వరకు హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. హనుమంతుడి జన్మవిశేషాలు, ఇతర అంశాలను ఆధ్యాత్మికపరంగానే కాకుండా వైజ్ఞానిక కోణంలోనూ ప్రముఖపండితులతో ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులను ఆకట్టుకునేలా తిరుమలలోని అంజనాద్రి, ఆకాశగంగ, నాదనీరాజనం వేదికలపై అన్నమాచార్య, దాససాహిత్య, హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారులతో ఆధ్యాత్మిక, భక్తిసంగీత కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జూన్ 2న తిరుమలలోని ధర్మగిరి వేదపాఠశాలలో సూర్యోదయంతో సంపూర్ణ సుందరకాండ అఖండపారాయణం ప్రారంభమవుతుందన్నారు. 2,872 శ్లోకాలను పండితులు పారాయణం చేస్తారన్నారు.

తిరుమలలో వేసవిరద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు

తిరుమలలో వేసవి రద్దీకి తగ్గట్టుగా చర్యలు తీసుకుంటున్నామని ధర్మారెడ్డి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు. రద్దీ అధికంగా ఉండే ప్రదేశాల్లో ఎండవేడి నుంచి ఉపశమనం కల్పించేలా చలువపందిళ్లు, కూలింగ్‌పెయింట్, కార్పెట్లు వేశామన్నారు. నేలపై నీళ్లతో ఎప్పటికప్పుడు పిచికారీ చేస్తున్నామన్నారు. తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో గత ఏడాదిలో 14 గుండెమార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గత నెలలో 20.17 లక్షల మంది శ్రీవారిని దర్శించుకోగా, హుండీ ఆదాయం రూ.101.63 కోట్లు లభించినట్టు తెలిపారు.

● ‘పూజా’కాలం దేవుళ్లకు మంచిరోజులు!

కొండకోనల్లో గమ్మున తమమానాన తాము ఉంటున్న దేవుళ్లకు మంచిరోజులు వచ్చేశాయి. గుళ్లూ గోపురాలు రాజకీయ జనాలతో కళకళలాడుతున్నాయి. మానవ ప్రయత్నంతో పాటు దైవ ప్రయత్నమూ తోడవ్వాలన్నది భారతీయ సంప్రదాయం. ఎంత కష్టపడినా ఫలితం అనుకూలంగా ఉండాలంటే దైవబలం తోడవ్వాలన్నది మనకున్న నమ్మకం. ఈ సంప్రదాయాలనూ, నమ్మకాలనూ తూచా తప్పకుండా పాటించేది రాజకీయాలలోనే. మరీ ఎన్నికలొచ్చాయంటే చాలు.. గుడులు, గోపురాలు తిరగడం, తమను లేదా తాము అభిమానించే నాయకుడిని గెలిపించాలని భక్తిగా దేవతలకు మొక్కడం రాజకీయ నాయకులకు ఆనవాయితీ. ఎన్నికలు పట్టుమని పదిరోజులు కూడా లేవిక. అందుకే హడావుడి తీవ్రమైపోయింది. ఒకవైపు ప్రచారాలను ఉధృతం చేస్తూనే, వీలు కల్పించుకుని ఆలయాలనూ సందర్శించేస్తున్నారు నాయకులు. కోరిన కోరిక తీరుస్తాడని స్థానికంగా నమ్మకం బాగా ఉన్న దేవతలను వెదకి మరీ, కొండకోనల్లో ఉన్నా సరే మండే ఎండలను లెక్క చేయకుండా నడిచే వెళ్లిపోతున్నారు.




కూసూరు దేవాలయంలో సురేశ్‌బాబు పూజలు

మనసారా మొక్కి ‘విజయాన్ని అందించు సామీ’ అని వేడుకుంటున్నారు. అలా టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అనుచరగణంతో పైపాళ్యం పంచాయతీ కూసూరులో కొండ కోనల నడుమ కొలువైన సుబ్రహ్మణ్యస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. ‘అధినేత చంద్రబాబునాయుడును లక్ష ఓట్ల మెజారిటీతో అఖండ విజయాన్ని అందించు స్వామీ’ అంటూ మొక్కుకున్నారు.

– కుప్పం

మందు ‘పార్టీ’లు



రెండు రోజుల కిందట చంద్రమాకులపల్లె సచివాలయం వద్ద ‘పార్టీ’ సందడి

పోలింగ్ తేది దగ్గరపడే కొద్దీ పుంగనూరులో మందు ‘పార్టీలు’ ఎక్కువవుతున్నాయి. దీనికోసం గ్రామ సచివాలయాన్నే వేదికగా మార్చేశారు కొందరు వైసీపీ నేతలు. రెండురోజుల కిందట పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె గ్రామంలో వైసీపీ నాయకులు ప్రచారం పూర్తి చేసుకున్నారు. ఆ రాత్రికి గ్రామసచివాలయం వద్దే ప్రచారంలో పాల్గొన్న వారికి మందు బాటిళ్లు, బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈవిషయంపై టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది కూడా. ఇక పార్టీ క్యాడర్‌కు ప్రతి రాత్రి మందు, విందే. ఇలా నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో మందు, విందు పార్టీలు జోరుగా సాగుతున్నాయి.


– పుంగనూరు

టీడీపీ కంచుకోట

చిత్తూరు పార్లమెంటు చరిత్ర

తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక చిత్తూరు పార్లమెంటుకు 10 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఏడు సార్లు టీడీపీ గెలిచింది. చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం అసెంబ్లీ స్థానంలో అత్యధికంగా మెజార్టీ వస్తుండడం.. చిత్తూరు లోక్‌సభలో టీడీపీ అభ్యర్థి విజయానికి కలిసొచ్చే అవకాశం. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఈ స్థానం ఎస్సీలకు రిజర్వు అయింది. చిత్తూరు తొలి ఎంపీగా 1952-57 మధ్యకాలంలో టీఎన్ విశ్వనాథరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఎస్సీలకు రిజర్వు అయ్యాక తొలిసారి 2009లో టీడీపీ నుంచి నటుడు, దర్శకుడు ఎన్.శివప్రసాద్ ఎంపీగా గెలుపొందారు.

పదవీ కాలం	ఎంపీ పేరు	పార్టీ
1952-57	టీఎన్ విశ్వనాథరెడ్డి	కాంగ్రెస్
1957-62	ఎంఏ అయ్యంగార్	కాంగ్రెస్
1962-67	ఎన్‌జీ రంగా	స్వతంత్ర పార్టీ
1967-71	ఎన్‌పీసీ నాయుడు	కాంగ్రెస్
1971-77	పి.నరసింహరెడ్డి	కాంగ్రెస్
1977-80	పి.రాజగోపాలనాయుడు	కాంగ్రెస్
1980-84	పి.రాజగోపాలనాయుడు	కాంగ్రెస్
1984-89	ఎన్‌పీ ఝాన్సీలక్ష్మి	టీడీపీ
1989-91	జ్ఞానేంద్రరెడ్డి	కాంగ్రెస్
1991-96	జ్ఞానేంద్రరెడ్డి	కాంగ్రెస్
1996-98	రామకృష్ణారెడ్డి	టీడీపీ
1998-99	రామకృష్ణారెడ్డి	టీడీపీ
1999-2004	రామకృష్ణారెడ్డి	టీడీపీ
2004-09	డీకే ఆదికేశవులు	టీడీపీ
2009-14	శివప్రసాద్	టీడీపీ
2014-19	శివప్రసాద్	టీడీపీ
2019-24	ఎన్ రెడ్డెప్ప	వైసీపీ



విశేషాలు

● గుంటూరు జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు నాయకుడు ఆచార్య ఎన్జీ రంగాను చిత్తూరు లోక్‌సభ ప్రజలు ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపించారు. నెహ్రూ విధానాలను వ్యతిరేకించి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన ఆయన స్వతంత్ర పార్టీని స్థాపించి 1962 ఎన్నికల్లో చిత్తూరు ఎంపీగా పోటీ చేసి గెలిచారు.

● నూతనకాల్వ రామకృష్ణారెడ్డి 1996, 98, 99 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి మూడుసార్లు గెలుపొందారు. హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది ఈయన ఒక్కరే. ఈయన మాజీ మంత్రి అమరనాథరెడ్డి తండ్రి.

అసెంబ్లీ నియోజక వర్గాలు

కుప్పం, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, చంద్రగిరి

● చంద్రగిరి పూర్తిగా, నగరి సెగ్మెంట్‌లోని పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలో ఉన్నాయి.

● చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం రాజంపేట పార్లమెంటు పరిధిలో ఉంది.

రోహిత్ వేముల కేసులో నిందితులకు క్లీన్‌చిట్

▸ రోహిత్ దళితుడు కాదని పోలీసుల నివేదిక

హైదరాబాద్, రాయదుర్గం, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని.. పోలీసులు హైకోర్టుకు మార్చి 21న ఇచ్చిన ఈ కేసు క్లోజర్ రిపోర్టులో పేర్కొన్నారు. రోహిత్ ఎస్సీ కాదని.. అతడు, అతడి కుటుంబసభ్యులు బీసీ-ఏ (వడ్డెర) కులానికి చెందినవారని.. వారు మోసపూరిత విధానాల్లో ఎస్సీ సర్టిఫికెట్లు పొందారని.. జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ తేల్చినట్లు అందులో వెల్లడించారు. తన కులధ్రువీకరణ పత్రం సరైనది కాదనే విషయం బయటకు తెలిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే భావనతోనే అతడు ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న బీజేపీ, ఏబీవీపీ నేతలకు, హెచ్‌సీయూ నాటి వీసీ అప్పారావుకు అతడి ఆత్మహత్యతో సంబంధం లేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. హెచ్‌సీయూలో 2015లో.. ఏబీవీపీ, అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో.. ఆ వర్సిటీ కుల రాజకీయాలకు, జాతివ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందంటూ నాటి కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి లేఖ రాశారు. ఆ ఏడాది నవంబరులో వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సిఫారసుతో.. ఐదుగురు విద్యార్థులపై వీసీ అప్పారావు బహిష్కరణ వేటు వేశారు. దరిమిలా 2016 జనవరి 17న రోహిత్ వేముల.. న్యూరిసెర్చ్ స్కాలర్ హాస్టల్ రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించాడు. దీంతో.. వీసీ అప్పారావు, బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, ఏబీవీపీ నాయకుల వేధింపుల వల్లే రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడని విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వారి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు వీసీ అప్పారావు, ఎన్ రామచంద్రరావు, ఏబీవీపీ నాయకులు, తదితరులపై ఐపీసీ 306, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధకచట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే, రోహిత్ ఆత్మహత్య వ్యవహారంతో తమకు ఏ సంబంధమూ లేదని.. ఈ కేసులు కొట్టేయాలని విజ్ఞప్తి చేస్తూ వారంతా హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పోలీసుల క్లోజర్ రిపోర్టు ప్రకారం.. రోహిత్ ఆత్మహత్యతో వారికి సంబంధం లేదని పేర్కొంటూ విచారణను ముగిస్తున్నట్లు వెల్లడించింది.

రాష్ట్రంలో 6, 8 తేదీల్లో మోదీ పర్యటన

▸ మూడు సభలు... బెజవాడలో ర్యాలీ: ఎన్డీఏ నేతలు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 6, 8 తేదీల్లో రాష్ట్రానికి వస్తున్నారని ఎన్డీఏ నేతలు తెలిపారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అశోక్ బాబు(టీడీపీ), లంకా దినకర్(బీజేపీ), గౌతమ్(జనసేన) విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆరో తేదీన మోదీ రాజమహేంద్రవరం చేరుకుని ఎన్డీఏ సభలో చంద్రబాబు, పవన్, పురందేశ్వరితో కలసి ప్రసంగిస్తారు. అదే రోజు సాయంత్రం అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని కశింకోటలో జరిగే సభలో బాబు, పవన్, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో కలసి పాల్గొంటారు. ఈ నెల 8న మధ్యాహ్నం తిరుపతికి చేరుకుని పీలేరు అసెంబ్లీ పరిధిలోని కలికిరి సభలో టీడీపీ, జనసేన అధ్యక్షులతోపాటు మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డితో కలసి ఓటర్లను ఎన్డీఏ అభ్యర్థుల్ని గెలిపించాల్సిందిగా అభ్యర్థిస్తారు. అదే రోజు సాయంత్రం ఐదింటికి కూటమి నేతలతో కలసి విజయవాడ ఐజీఎం స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకూ ర్యాలీలో పాల్గొంటారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

▸ అన్ని ప్రాంతాల రైతులను ఆదుకుంటాం: కూటమి నేతలు

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. కేంద్రం సహకారంతో పోలవరాన్ని పూర్తి చేసి, ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం. అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించి, రైతుల్ని ఆదుకుంటాం' అని కూటమి నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు(టీడీపీ), బీజేపీ నేత పాకా సత్యనారాయణ, జనసేన పార్టీ నేత గౌతమ్ మీడియాతో మాట్లాడారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలోకి మరో ఇద్దరు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కమిటీలో మరో ఇద్దరికి స్థానం లభించింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వీఆర్ శ్రీలక్ష్మి రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. పర్చూరు నియోజకవర్గానికి చెందిన కారుమంచి వెంకట కృష్ణారావును రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు: కనకమేడల

న్యూఢిల్లీ, మే 3(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం రూపొందించిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు' అని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం, ఇక్కడ తన అధికారిక నివాసంలో విలేకరుల సమావేశంలో కనకమేడల మాట్లాడుతూ.. 'వైసీపీ నేతలు కబ్జా చేసిన ఎన్‌ఆర్‌ఐ ఆస్తులను అధికారికంగా సొంతం చేసుకోవడానికి ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తేవాలని చూస్తోంది. ప్రజలు గమనించాలి' అన్నారు.

158 ట్యూటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో కొత్తగా ప్రారంభించిన ఐదు మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 158 ట్యూటర్ పోస్టుల భర్తీకి ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆమోదించింది. దీంతో ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ నెల 4 నుంచి 15లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని, మరిన్ని వివరాల కోసం డీఎంఈ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రక్తహీనత పరీక్షలు వేగవంతం

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత పరీక్షలను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనం నుంచి జిల్లా వైద్యాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వడగాలుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్ పద్మావతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమాంతం పెరిగిన విద్యుత్తు డిమాండ్

▸ గతేడాది 183.185.. ఇప్పుడు 256.677 ఎంయూ

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు డిమాండ్ అమాంతం ఎగబాకింది. ఇప్పటిదాకా 253 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా, గురువారం ఏకంగా 256.677 మిలియన్ యూనిట్లను తాకింది. తగ ఏడాది మే రెండో తేదీన విద్యుత్తు డిమాండ్ 183.185 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉంది. థర్మల్ విద్యుత్తు సంస్థలలో సగటున మూడు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలున్నాయి.

జస్టిస్ రామలింగేశ్వరరావుకు హైకోర్టు ఘన నివాళి

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావుకు శుక్రవారం హైకోర్టు ఘన నివాళులర్పించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో ఇతర న్యాయమూర్తులు మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జస్టిస్ రామలింగేశ్వరరావు అందించిన న్యాయసేవలను అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం వివరించారు. జస్టిస్ రామలింగేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు.

'గృహ హింస' సెక్షన్లలో మార్పులు

▸ శాసనవ్యవస్థకు, పోలీసులకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, మే 3: భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 498 ఏ (గృహ హింస) దుర్వినియోగం అవుతున్న తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో యాంత్రికంగా వ్యవహరించవద్దని పోలీసులకు.. ఐపీసీ స్థానంలో కొత్తగా తీసుకొస్తున్న భారతీయ న్యాయసంహితలో గృహహింసకు సంబంధించిన సెక్షన్ 85, 86లో తగిన మార్పులు చేయాలని శాసనవ్యవస్థ (లెజిస్లేచర్)కు సూచించింది. అలాగే.. దృఢమైన దాంపత్య బంధానికి సహనమే పునాది అని, గోరంత విషయాలను కొండంతలుగా చేసి చూడొద్దని, కాపురాలను కూల్చుకోవద్దని సూచిస్తూ.. తమ ముందుకు వచ్చిన ఓ వరకట్న వేధింపుల కేసును జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం కొట్టేసింది.



ఆకాశంలో డేగ కన్ను..

తొలి స్వదేశీ బాంబర్ యూఏవీ ఆవిష్కరణ

బెంగళూరు, మే 3: భారత్‌కు చెందిన రక్షణ, ఏరోస్పేస్ కంపెనీ ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ టెక్నాలజీస్.. కీలక మైలురాయిని సాధించింది. భారత్‌లో తొలిసారిగా రూపొందించిన స్వదేశీ బాంబర్ మానవరహిత వైమానిక వాహనం (యూఏవీ) ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్-200బీని బెంగళూరు వేదికగా శుక్రవారం ఆవిష్కరించింది. 'భారతదేశ డేగ కన్ను'గా భావిస్తున్న ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ (ఎఫ్‌డబ్ల్యూడీ)-200బీ అనేది 'మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (మేల్) మానవ రహిత యుద్ధ విమానం. 100 కిలోల పేలోడ్ సామర్థ్యం కలిగిన యూఏవీ... ఆప్టికల్ సర్వేలెన్స్ పేలోడ్లతోపాటు వైమానిక ఆయుధాలను కూడా మోసుకెళ్లగలదని ఆ సంస్థ తెలిపింది. బెంగళూరులో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ వ్యవస్థాపకుడు సుహాస్ తేజస్కంద మాట్లాడుతూ.. డీఆర్‌డీవో వంటి సంస్థలు ఈ తరహా యూఏవీని తయారు చేయాలని ప్రయత్నం చేసి విఫలమయ్యాయని చెప్పారు. దేశీయంగా యూఏవీని తయారు చేయాలనే భారత చిరకాల స్వప్నాన్ని ఎఫ్‌డబ్ల్యూడీ-200బీ సాకారం చేసిందని అన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న యూఎస్ ప్రిడేటర్ డ్రోన్ ఖరీదు రూ.250 కోట్లు కాగా, ఎఫ్‌డబ్ల్యూడీ-200బీ కేవలం రూ.25 కోట్లకే లభిస్తుందని తెలిపారు. ఈ యూఏవీ గరిష్ఠ వేగం గంటకు 370 కిలోమీటర్లు. ఇది ఒకసారి గాల్లోకి ఎగిరితే 12 నుంచి 20 గంటల వరకు ప్రయాణించగలదు.



విరిగిన చేతిని చూపుతున్న షేక్‌నసీమా, మీర్జావలి చేతికి అయిన గాయం

టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై వంశీ అనుచరుల దాడి

▸ ఆయన కుమారుడు, మనుమరాలికి తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 3: కృష్ణాజిల్లాలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. టీడీపీ మైనారిటీ నేత ఇంటిపై దాడిచేసి ఆయన కుమారుడు, 16ఏళ్ల మనవరాలిని తీవ్రంగా గాయపరిచారు. బాపులపాడు మండలం కొత్త మల్లవల్లిలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కొత్త మల్లవల్లికి చెందిన షేక్‌జాన్ బాషా, ఆయన కుమారుడు మీర్జావలి టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కొత్త మల్లవల్లి చెంతనే ఉన్న మీర్జాపురానికి గురువారం నూజివీడు టీడీపీ అభ్యర్థి పార్థసారథి వచ్చారు. ఆయన్ను కలిసేందుకు మీర్జావలి వెళ్లారు. అక్కడే అలీ అనే వైసీపీ కార్యకర్త ఉండటంతో.. అలీ గన్నవరంలో వైసీపీకి, నూజివీడులో టీడీపీకి పనిచేస్తున్నారని సారథికి మీర్జావలి ఫిర్యాదు చేశారు. ఇది మనసులో పెట్టుకుని గురువారం రాత్రి కొత్తమల్లవల్లిలో గన్నవరం వైసీపీ అభ్యర్థి వంశీతోపాటు ప్రచారానికి వచ్చిన అలీ, వైసీపీ కార్యకర్తలు మీర్జావలి కుటుంబంతో ఘర్షణకు దిగారు. మీర్జావలి, ఆయన తండ్రి షేక్ జాన్ బాషా, ఇతర కుటుంబసభ్యులపై కర్రలతో దాడి చేశారు. మీర్జావలిపై బీరు సీసాతో దాడి చేయగా చేతికి గాయమై నరం కోసుకుపోయింది. ఈ గొడవను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న షేక్ జాన్ బాషా మనవరాలు నసీమాపైనా కర్రతో దాడి చేయడం తో ఆమె చెయ్యి విరిగింది. పోలీసులు రాకతో అల్లరిమూకలు చెల్లాచెదురయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గోవాపై బీజేపీ, కాంగ్రెస్ ధీమా!

▸ ప్రధాని మోదీ కరిష్మాపైనే బీజేపీ ఆశలు

▸ ప్రభుత్వ వ్యతిరేకతే కూటమి ప్రచారాస్త్రం

పనాజీ, మే 3: మూడో విడతలో భాగంగా గోవాలోని రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఇక్కడ ప్రధాని మోదీ కరిష్మాతో గెలుపొందాలని బీజేపీ భావిస్తుండగా.. ఉపాధి కల్పన, అవినీతి రహిత పాలన అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ తన ప్రచారాస్త్రాలుగా ఎంచుకుంది. ఉత్తర, దక్షిణ గోవా ఎంపీ స్థానాలకు ఈ నెల 7న ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తర గోవా నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఐదుసార్లు ఎంపీ, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్.. కాంగ్రెస్ అభ్యర్థి రమాకాంత్ ఖలాప్‌తో పోటీపడుతున్నారు. ఇక దక్షిణ గోవాలో బీజేపీ మహిళా అభ్యర్థి, వ్యాపారవేత్త పల్లవి డెంపో, కాంగ్రెస్ అభ్యర్థి విరియాతో ఫెర్నాండెజ్‌తో తలపడనున్నారు. ఈ ఎన్నికలపై బీజేపీ గోవా అధికార ప్రతినిధి యతీశ్ నాయక్ మాట్లాడుతూ.. "ప్రజలు స్థిరత్వం కోరుకుంటున్నారు. వారికి కిచిడీ (బహుళ పార్టీల) ప్రభుత్వం అక్కర్లేదు' అని అన్నారు. వచ్చే ఐదేళ్లపాటు దేశాన్ని ఎవరు పాలించాలనేది ప్రజలు ఓటేసే ముందు ఆలోచించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి బలమైన నాయకత్వాన్ని అందించారని, ప్రపంచ నాయకుడిగా ఎదిగారని అన్నారు. బీజేపీ పాలనలో జనం అభివృద్ధిని చూశారని నాయక్ అన్నారు. గోవాలోని రెండు స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకుంటుందని, దేశవ్యాప్తంగా 400 ఎంపీ స్థానాల మార్కుని దాటుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, ప్రస్తుత అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఇండియా కూటమిలో భాగమైన గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ) ప్రధాన కార్యదర్శి దుర్గాదాస్ కామత్ అన్నారు. 'రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది.. అలాగే మైనింగ్ సమస్యను పరిష్కరించడంలోనూ, గోవా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది' అని కామత్ విమర్శించారు. ఈ ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవాల్సిన బాధ్యత ఇండియా కూటమిపై ఉందన్నారు. ఈ నెల 7న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి చెందిన ఇద్దరు అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థుల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభలకు హాజరవుతున్నారని కామత్ చెప్పారు. 2019 ఎన్నికల్లో ఉత్తర గోవాలో సిట్టింగ్ ఎంపీ నాయక్ 2.44 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందగా.. దక్షిణ గోవాలో బీజేపీ అభ్యర్థి నరేంద్ర సవైకర్ 9,755 ఓట్ల స్వల్ప మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి ఫ్రాన్సిస్కోపై విజయం సాధించారు.



బొగ్గు తరలింపునకు అవరోధాలు వద్దు

▸ గంగవరం నిర్వాసిత కార్మికులకు హైకోర్టు సూచన

▸ సమస్య పరిష్కారానికి చర్చలు కొనసాగించండి

▸ పోర్టు యాజమాన్యానికి ఆదేశాలు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): నిర్వాసిత కార్మికులతో చర్చల ప్రక్రియను కొనసాగించాలని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. పోర్టులోని బొగ్గు, ఇనుప ఖనిజం, లైమ్‌స్టోన్, ఇతర సరుకులను బయటకు తరలించేందుకు ఎలాంటి అవరోధాలూ కల్పించవద్దని నిర్వాసిత కార్మికులకు సూచించింది. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా రక్షణ కల్పించాలని విశాఖ పోలీసుకమిషనర్‌ను ఆదేశించింది. నిర్వాసిత కార్మికులతో చర్చల పురోగతి పై అఫిడవిట్ సమర్పించాలని పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించింది. విచారణను జూన్ 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. నిర్వాసిత కార్మికుల సమ్మె నేపథ్యంలో అదానీ గంగవరం పోర్టు నుంచి విశాఖస్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరాలో ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు తీసుకొనేలా విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.వెంకట దుర్గాప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం వివాద పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం, పోలీసు కమిషనర్ సమక్షంలో నిర్వాసిత కార్మికులతో చర్చలు జరపాలని గంగవరం అదానీ పోర్టు యాజమాన్యాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా అదానీ గంగవరం పోర్టు తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. శాంతి భద్రతల సమస్య కారణంగా చూపి రాష్ట్ర ప్రభుత్వం సమస్య నుంచి దూరంగా జరగడానికి వీల్లేదన్నారు. సమ్మె సమయంలో కార్మికులు పోర్టు ఆవరణలో నిరసనకు దిగడానికి వీల్లేదని పేర్కొన్నారు. అందుకు సంబంధించి పలుతీర్పులను కోర్టు ముందు ఉంచారు. నిర్వాసిత కార్మికుల డిమాండ్ల పై చర్చించే ముందు వారు సమ్మెను విరమించాలని, పోర్టులో కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) సి.సుమన్ వాదనలు వినిపిస్తూ.. లేబర్ కమిషనర్ వద్ద నిర్వాసిత కార్మికులతో చర్చల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అయితే నిర్వాసిత కార్మికుల తరఫున పోర్టు కార్యకలాపాలతో సంబంధంలేని వ్యక్తి చర్చలకు హాజరుకావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోర్టు యాజమాన్యం గురువారం చర్చల ప్రక్రియలో పాల్గొనలేదని తెలిపారు. పోర్టులో సాధారణ పరిస్థితులు ఏర్పడిన తరువాత మాత్రమే నిర్వాసిత కార్మికుల డిమాండ్ల పై చర్చిస్తామని యాజమాన్యం లేబర్ కమిషనర్ ముందు చెప్పిందన్నారు. ఆర్ఐఎన్ఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్టీల్ ప్లాంట్ అవసరాల కోసం ప్రతి రోజూ 12వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమని తెలిపారు. సుమారు రూ.500కోట్ల విలువ చేసే 2.32 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన బొగ్గు అదానీ గంగవరం పోర్టు స్టాక్ యార్డ్‌లో ఉండిపోయిందని పేర్కొన్నారు. పోర్టు నుంచి స్టీల్ ప్లాంట్‌కు కన్వేయర్ బెల్ట్ ఉందని, దీని ద్వారా బొగ్గు సరఫరా కాకుంటే స్టీల్ ప్లాంట్ మూతపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని అభిప్రాయపడ్డారు. చర్చల ప్రక్రియను కొనసాగించాలని అదానీ గంగవరంపోర్టు యాజమాన్యాన్ని ఆదేశించారు.

ఆస్ట్రాజెనెకా, సీరమ్‌పై కేసు వేస్తాం

▸ టీకా మరణాలకు కారణమైన అందరిపైనా న్యాయపోరాటం చేస్తాం

▸ కొవిషీల్డ్ టీకా కారణంగా కుమార్తెను కోల్పోయిన ఓ తండ్రి ఆవేదన



న్యూఢిల్లీ, మే 3: కొవిషీల్డ్ టీకా వేయించుకున్న కొంత కాలానికే తన కుమార్తెను పోగొట్టుకున్న ఓ తండ్రి.. ఆ టీకాతో దుష్ప్రభావాలున్నాయంటూ ఆస్ట్రాజెనెకా అంగీకరించిన నేపథ్యంలో ఆ కంపెనీపైన, సీరం సంస్థపైన కోర్టులో కేసు వేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన పేరు వేణుగోపాలన్ గోవిందన్. ఆయన కుమార్తె కారుణ్య వేణుగోపాల్ డేటా సైన్స్ విద్యార్థి. 2021 జూన్‌లో ఆమె కొవిషీల్డ్ టీకా తీసుకుంది. టీకా తీసుకున్న ఎనిమిది రోజులకు ఆమె అనారోగ్యం బారిన పడింది. శరీరంలోని పలు అవయవాలు ఇన్‌ఫ్లమేషన్ (వాపునకు) గురయ్యాయి. దాదాపు నెలరోజుల తర్వాత 2021 జూలైలో ఆమె మరణించింది. చనిపోయేనాటికి ఆమె వయసు కేవలం 20 ఏళ్లు. ఉన్న ఆమె తమ మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా దేవుడు తమకు కానుకగా అందించిన కారుణ్యను అల్లారుముద్దుగా పెంచుకున్నామని.. టీకా తీసుకోకముందు ఆమెకు ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవని, పూర్తి ఆరోగ్యంతో ఉండేదని.. కేవలం వ్యాక్సిన్ కారణంగా ఆమెను కోల్పోయామని వేణుగోపాలన్ గోవిందన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన టీకా కార్యక్రమాల విభాగం కారుణ్య మరణంపై విచారణ జరిపి 2021 నవంబరులో ఒక నివేదిక ఇచ్చింది. దాంట్లో ఆమె కారుణ్య మరణాన్ని 'బీ1' కేటగిరీలో చేర్చింది. అంటే.. ఆమె మరణానికి టీకానే కారణమన డానికి తగిన ఆధారాలు లేవని అర్థం. దీంతో గోవిందన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తె మరణానికి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని.. టీకా దుష్ప్రభావాలను ముందుగానే గుర్తించి, తక్షణం చికిత్స చేసేలా ఒక ప్రొటోకాల్ రూపొందించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంను కోరారు. ఈ కేసు విచారణలో భాగంగా 2022 నవంబరులో కేంద్ర ప్రభుత్వం.. కొవిడ్ టీకా కారణంగా సంభవించే మరణాలకు పరిహారం ఇచ్చే బాధ్యత తమది కాదని సుప్రీం కోర్టుకు తేల్చిచెప్పింది. తాజాగా.. ఈ టీకా దుష్ప్రభావాలపై ఆస్ట్రాజెనెకా ప్రకటన నేపథ్యంలో కారుణ్య తల్లిదండ్రులు మళ్లీ కోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నారు. దీనిపై గోవిందన్ 'ఎకనమిక్ టైమ్స్' వార్తా సంస్థకు ఒక వ్యాసం రాశారు. కొవిషీల్డ్ టీకాను మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చిన రెండునెలల్లోపే.. అంటే, 2021 మార్చిలోనే యూరప్‌లోని 15 దేశాలు ఈ టీకా వల్ల కలిగే దుష్ప్రభావాలను గుర్తించి.. ప్రజలకు ఇవ్వడం నిలిపివేశాయని గుర్తుచేశారు. యూరప్ దేశాల్లో ఈ టీకా వేయడాన్ని ఆపేసిన విషయం తెలిసీ దాన్ని మనదేశంలో ఎందుకు నిలిపివేయలేదని ప్రభుత్వాన్ని, సీరమ్ సంస్థను ప్రశ్నించారు. న్యాయం కోసం.. ప్రజారోగ్యం పేరిట ఇలాంటి దారుణాలు మళ్లీ చేయకుండా ఉండడం కోసం.. ఎంతోమంది మరణాలకు కారణమైనవారందరిపైనా తమలాగానే ఈ టీకా కారణంగా పిల్లలను కోల్పోయిన మరో ఏడు కుటుంబాలతో కలిసి ఈ పోరాటం సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రాణం తీసిన 'నాటకం'

▸ రాక్షస పాత్రధారుడి గొంతు కోసిన కాళీమాత పాత్రధారి

▸ 11 ఏళ్ల బాలుడి మృతి.. 14 ఏళ్ల బాలుడి అరెస్ట్.. యూపీలో ఘటన

కాన్పూర్, మే 3: ఓ నాటకంలో కాళీమాత పాత్రలో నటించిన ఓ బాలుడు(14), రాక్షసుడి పాత్రలో నటించిన మరో బాలుడి(11) గొంతును కత్తితో కోశాడు. దీంతో 11 ఏళ్ల బాలుడు ప్రాణాలను కోల్పోయాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగింది. బంభియాన్‌పూర్ గ్రామానికి చెందిన సుభాశ్ సైనీ నివాసంలో బుధవారం 'భగవత్ కథ' నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో కొంతమంది పిల్లలు వివిధ పాత్రలను పోషించారు. ఈ క్రమంలోనే కాళీమాత పాత్రలో నటించిన బాలుడు, రాక్షస పాత్రలో నటించిన మరో బాలుడి మెడను కత్తితో కోశాడు. తీవ్ర గాయమైన సదరు బాలుణ్ని(11) స్థానిక ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు అతడు మృతిచెందినట్లు ప్రకటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మరో ఆస్పత్రికి తరలించారు. నిందితుడైన 14 ఏళ్ల బాలుణ్ని అదుపులోకి తీసుకున్నారు. అతణ్ని జువెనైల్ కోర్టులో హాజరు పరిచి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. కాగా కాళీమాత వేషం వేసిన బాలుడు త్రిశూలంతో నటించాల్సి ఉండగా.. ఆ సమయంలో అది దొరక్కపోవడంతో పదునైన కత్తిని తీసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు.

హేమంత్ సోరెన్‌కు హైకోర్టులో నిరాశ

▸ ఈడీ కేసు కొట్టివేతకు నిరాకరణ



రాంచీ, మే 3: ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు శుక్రవారం హైకోర్టులో నిరాశ ఎదురయింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈడీ తనపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ ఆయన చేసిన వినతిని తిరస్కరించింది. ఏడు గంటల పాటు విచారించిన అనంతరం ఈడీ ఆయనను జనవరి 31న అరెస్టు చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ తాను చేసిన వినతిపై హైకోర్టు తీర్పు ఇవ్వడం లేదంటూ ఆయన గత నెలలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించడం గమనార్హం. తాజాగా హైకోర్టు నిర్ణయాన్ని వెలువరిస్తూ కేసు కొట్టివేతకు నిరాకరించింది

'గులకరాయి'ని రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నారు

▸ విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు

▸ జగన్, సజ్జల, కొడాలి, పేర్నికి నోటీసుల జారీకి ఆదేశాలు

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి ఘటనను వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన న్యాయవాది నాగేశ్వరరావు విజయవాడలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఈ ఘటన గురించి మాట్లాడకుండా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై కోర్టు స్పందించింది. ఈ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అన్న దానిపై వాదనలు జరిగిన అనంతరం, ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ.. విచారణను జూన్ 28వ తేదీకి వాయిదా వేసింది. కాగా, సీఎం జగన్‌పై గడచిన నెల 13వ తేదీన రాయి దాడి జరిగిన విషయం తెలిసిందే.

వరదాపురం సూరికి పాస్‌పోర్టు ఇవ్వండి

▸ ఆదేశాలిచ్చిన ప్రత్యేక కోర్టు

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూరి అలియాస్ వరదాపురం సూరికి పాస్‌పోర్టు జారీ చేయాలని విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు శుక్రవారం ఆదేశాలు ఇచ్చింది. గత నెల 4వ తేదీన సూరి పాస్‌పోర్టు పోయిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే సమయంలో తనకు డూప్లికేట్ పాస్‌పోర్టు ఇప్పించాలని పాస్‌పోర్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాప్రతినిధుల కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నందున తాము పాస్‌పోర్టు ఇవ్వలేమని అధికారులు సమాధానం ఇచ్చారు. దీనిపై సూరి తరఫున న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సూరి కుమారుడికి విదేశాల్లోని విద్యాసంస్థల్లో అడ్మిషన్ ఉందని, అందుకోసం ఆయన అక్కడికి వెళ్లాల్సి ఉన్నందున పాస్‌పోర్టు ఇప్పించాలని వాదించారు. దీంతో ఏకీభవించిన కోర్టు వరదాపురం సూరికి పాస్‌పోర్టు జారీ చేయాలని పాస్‌పోర్టు అధికారులను ఆదేశించింది.



విశాఖ తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఇంటి వద్ద ఎన్నికల నిఘా బృందాలు, పోలీసులు

ఎంపీ ఎంవీవీ ఇంటిపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక దాడి

▸ కొనసాగుతున్న సోదాలు

పెదవాల్తేర్ (విశాఖపట్నం), మే 3: విశాఖపట్నం ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఇంటిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఫ్లయింగ్ బృందాలు శుక్రవారం రాత్రి దాడి చేశాయి. రాత్రి 7.40 గంటలకు ఒక బృందం లాసన్స్ బే కాలనీలోని ఎంవీవీ ఇంటికి వచ్చింది. మరో బృందం ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎంపీ ఎంవీవీ వద్దకు వెళ్లి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి తీసుకొని వచ్చింది. ఆ తరువాత 9.40 గంటలకు ఇంకో బృందం అక్కడికి చేరుకుంది. మొత్తం మూడు బృందాలు, పోలీసులతో కలసి సుమారు 25 మంది సోదాలు చేస్తున్నారు. ఎంవీవీ ఇంట్లోకి బయటవారిని ఎవరినీ అనుమతించకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సోదాలు చేస్తున్న సమయంలో ఎంవీవీ సన్నిహితుడు, వైసీపీ నేత జీవీ కూడా ఉన్నట్టు చెబుతున్నారు. ఎంవీవీ భవనం నాలుగు అంతస్థుల్లో ఉంది. ఇందులో రెండు అంతస్థుల్లో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న బృందాలు, అక్కడ ఉన్న వ్యక్తులను ప్రశ్నించినట్టు తెలిసింది. అర్ధరాత్రి దాటిన తరువాత కూడా సోదాలు కొనసాగుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏపీలోని ఆ ఐదు గ్రామాలు రాష్ట్రంలోకి

▸ ఐటీఐఆర్ పునఃప్రారంభం

▸ విభజన హామీల అమలు... తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో

హైదరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏపీలో భాగమైన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయడం, ఐటీఐఆర్ ప్రాజెక్టు పునఃప్రారంభం, ఐదు ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు, విభజన హామీల అమలు, విద్యా సంస్థల ప్రారంభం, మేడారం జాతరకు జాతీయ హోదా తదితర 23 హామీలతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమైంది. ఐదు న్యాయాలు, తెలంగాణకు ప్రత్యేక హామీల పేరిట పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్రం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోను శుక్రవారం విడుదల చేసింది. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు.

తెలంగాణకు ఇచ్చిన ప్రత్యేక హామీలు ఇవే

1)హైదరాబాద్ మహా నగరానికి కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) ప్రాజెక్ట్ పునఃప్రారంభం

2) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం), హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి పక్క నుంచి రాపిడ్ (వేగవంతమైన) రైల్వే వ్యవస్థ, మైనింగ్ వర్సిటీల ఏర్పాటు

3) హైదరాబాద్- బెంగళూరు ఐటీ మరియు ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్ - నాగపూర్, హైదరాబాద్ వరంగల్, హైదరాబాద్ - నల్గొండ - మిర్యాలగూడ, సింగరేణి ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు

4) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014 ప్రకారం ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామాలు.. ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నెగూడెం, పిచుకలపాడును తిరిగి తెలంగాణలో విలీనం చేయడం. భద్రాచలం ఆలయ అభివృద్ధి కోసమే ఈ విలీనం.

5) పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా

6) హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు